జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 6 సంచిక - 23 పక్షపత్రిక డిసెంబర్ 1-15, 2015

## 'స్థానిక సాధికారత' దిక్సూచి మాస్టర్ కు



## హైదరాబాద్ ఆవాజ్


ఓ సామాన్య కూలీ కూతురు కలెక్టర్ కొడుకు చదువు తో పోటీపడే అవకాశం లేకపోతే!!!
ఏ తల్లి కడుపున పుట్టాం అన్న ఒక్క కారణమే ఆ బిడ్డల బ్రతుక్కి శాపమైతే!!!
ఎందుకీ సమాజం???
ఎందుకీ చరిత్ర???
ఎందుకీ రాజకీయం???
లోక్‌సత్తా పార్టీ
WIN.LOKSATTA.ORG

జన రాజకీయం కోసం...
**లోక్‌సత్తా టైమ్స్**
పక్షపత్రిక డిసెంబర్ 1-15, 2015
సంపుటి - 6 సంచిక - 23

## లోపలి పేజీల్లో...

గ్రేటర్ ఎన్నికల్లో పనిచేసే వారినే గెలిపించండి.............. 5
త్వరలో ఉత్తరాంధ్ర, తెలంగాణలో కూడా..................... 6
రాబోయే ఎన్నికల్లో లోక్ 'సత్తా ' చాటాలి : సురేన్....... 7
పాఠశాల విద్యాప్రమాణాలను పెంచేందుకు లక్షల్లో .... 8
స్థానిక సాధికారతే తక్షణ మాస్టర్ కీ............................ 10
పెట్టుబడులు రావు, నక్సలైట్లు పెరుగుతారు : జేపీ........ 21
కొలీజియం ఒక ఎలీట్ క్లబ్, కొందరికే ప్రవేశం............. 24
రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి...................................... 26
రైతులకు ఆదాయ భద్రత కల్పించలేని కేంద్ర, రాష్ట్ర..... 27
స్వచ్ఛభారత్ తొలి అడుగు ఎప్పుడు?............................ 30
చెలరేగుతున్న మాఫియాను అడ్డుకోవాలి..................... 33
విపత్తులపై స్థానిక ప్రభుత్వాలదే కీలకపాత్ర.................... 33
లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు....................................... 34


### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**సంపాదక వర్గం**
బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# రాజ్యాంగాన్ని వికేంద్రీకరించాలి, రాష్ట్రాలకు సొంత రాజ్యాంగాలపై చర్చ జరగాలి



బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్ 125వ జయంతి సంవత్సరంలో రాజ్యాంగ దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. జాతి నిర్మాతలు మనకి ఉదారమైన, ఏకాభిప్రాయంతో కూడిన డాక్యుమెంట్‌ని రాజ్యాంగంగా అందించారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, భిన్నత్వం, సమానత్వం, మానవ హక్కులు మన రాజ్యాంగం ప్రధాన బలాలు. మనదేశాన్ని నడిపించటంలో రాజ్యాంగం గొప్ప పాత్ర పోషించింది. దేశ విభజన భయానక పరిస్థితుల నేపథ్యంలో మనం కేంద్రీకృత రాజకీయ వ్యవస్థని నిర్మించుకున్నాం. అయితే గత 30ఏళ్లుగా ఫెడరల్ వ్యవస్థ పరిణతి చెందింది. ఇప్పుడు రాష్ట్రాలు తమ అభివృద్ధి బాధ్యతను తామే స్వీకరించటం మేలు. ఎన్నికల వ్యవస్థ, ప్రభుత్వ స్వరూపం, స్థానిక ప్రభుత్వాల నమూనాలను రాష్ట్రాలే ఫెడరల్ వ్యవస్థ పరిధిలో నిర్ణయించుకునే స్వేచ్ఛను ఇవ్వాలి. అమెరికా, బ్రిటన్ ఈ స్వేచ్ఛను ఇచ్చాయి. ఇటీవలికాలంలో మనదేశంలో చెప్పుకోదగిన విజయాలన్నీ రాష్ట్రాల్లో సత్తా వల్లే వచ్చాయి. ఢిల్లీ అన్ని సమస్యలనూ పరిష్కరించలేదు. అమెరికాలోలాగా రాష్ట్రాలకు సొంత రాజ్యాంగాలుండటం మేలు. ప్రజల్లో చీలిక తెచ్చే రాజకీయం, భిన్నత్వం, అస్థిరత్వం, రాజ్యసభ మనదేశాన్ని ఢిల్లీ నుంచి పరిపాలించటాన్ని అసాధ్యం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన యథాతథంగా కొనసాగుతుంది, కానీ ఈ రాజ్యాంగ వికేంద్రీకరణతో పాలనని పునర్నిర్మించి ప్రజల సాధికారతను పెంచే కొత్త ఆలోచనల్ని అమలు చేసే అవకాశం రాష్ట్రాలకు లభిస్తుంది. దీనిపై చర్చ జరగాలి.

*రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలతో...*

మీ




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# గ్రేటర్ ఎన్నికల్లో పనిచేసే వారినే గెలిపించండి

## హైదరాబాద్ ఆవాజ్‌లో జేపీ పిలుపు




గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో బస్తీలపై అవగాహన ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించే మంచివారినే ఎన్నుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రజలను కోరారు. హైదరాబాద్ ఆవాజ్‌లో భాగంగా లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి, నియోజకవర్గ ఇంఛార్జి మెట్ల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో నల్లకుంటలోని శివం కూరగాయల మార్కెట్‌లో ఆవాజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ మాట్లాడుతూ, ఆలోచించి అభివృద్ధి చేయగల సమర్థుడైన నాయకుడినే హైదరాబాదీలు ఎన్నుకోవాలన్నారు. తాను ఇక్కడికి వచ్చింది ఉపన్యాసాలు ఇవ్వటానికి కాదని, బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవటానికని అన్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్, డ్రైనేజీ, తవ్విపోసిన రోడ్లు, కుక్కలు, కోతుల బెడదను ప్రజలు జేపీ దృష్టికి తెచ్చారు. అన్ని సమస్యల పరిష్కారానికీ ఒకటే సరైన మార్గమని జేపీ అన్నారు. అది జీహెచ్ఎంసీ బడ్జెట్‌లో బస్తీకి జనాభా ప్రాతిపదికన ఎంత వాటా వస్తుందో అంత డబ్బుని బస్తీ కమిటీ చేతుల్లో పెట్టి అభివృద్ధి బాధ్యతను వారికి అప్పగించటమేనన్నారు. దీని ద్వారా జవాబుదారీతనం పెరిగి ఆయా బస్తీల్లోని కమిటీలే స్థానిక సమస్యల్ని పరిష్కరించుకునే వీలుంటుందన్నారు. వచ్చే గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో 150 డివిజన్లలో కనీసం మూడో వంతు కార్పొరేటర్లనైనా మంచి వారిని ఎన్నుకుంటే బస్తీల్లో సమస్యలు కొంతైనా పరిష్కారమవుతాయన్నారు. అందుకే డబ్బు వెదజల్లే వారిని కాకుండా అవగాహనతో పనిచేసే తత్వం గలవారిని ఎన్నుకోవాలని ప్రజలను కోరారు.

### అర్హులకే ఇళ్లు ఇవ్వాలి

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇవ్వటాన్ని స్వాగతిస్తున్నామని, కానీ తెరాస కార్యకర్తలకు కాకుండా అర్హులైన వారికే వాటిని అందించాలని జేపీ అన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మ కుంటలో నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లను ఆయన పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, పేదల కోసం నిర్మిస్తున్న రెండు పడకల ఇళ్ల నిర్మాణం కోసం దేశం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోందన్నారు. తెరాస ప్రభుత్వం హడావుడిగా ఆర్భాటంతో కాకుండా, నాణ్యతాప్రమాణాల్ని పాటిస్తూ పదికాలాలపాటు పదిలంగా ఉండే విధంగా ఇళ్లు కట్టాలన్నారు. గత ప్రభుత్వాలు నిర్మించిన ఇళ్లను కూడా ఎలాంటి రుణం అవసరం లేకుండా లబ్ధిదారులకు అందించాలన్నారు. కార్యక్రమాల్లో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోల్కర్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఉపాధ్యక్షురాలు గంగాభవానీ, ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి, సహాయ కార్యదర్శులు దేవీ ప్రసాద్, సుమలత, నాయకులు హరి, రాంచందర్, నర్సింహ, సంతోష్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. ⌖

## అనంతపురంలో రుద్రంపేట గ్రామాన్ని, 50వ మునిసిపల్ వార్డుని దత్తత తీసుకున్న జేపీ

# త్వరలో ఉత్తరాంధ్ర, తెలంగాణలో కూడా



**త్వరలో గ్రేటర్ హైదరాబాద్‌లో జరగనున్న ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ కార్యకర్తలతో చర్చించామని, రాజధానిలో లోక్‌సత్తా కార్యక్రమాలకు రోజురోజుకూ మద్దతు పెరుగుతుండటంతో పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా పాత రాజకీయమే నడుస్తుండటంతో విసిగిపోయిన ప్రజలు లోక్‌సత్తా కొత్త ప్రత్యామ్నాయ రాజకీయం పట్ల మొగ్గు చూపుతున్నారన్నారు.**

అధికార, అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యాలుగా 'సీమ చైతన్య భేరి' పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత వెనకబడిన రాయలసీమ జిల్లా అనంతపురంలో తన 9వ వార్షికోత్సవాన్ని లోక్‌సత్తా జరుపుకుందని, ఈ సందర్భంగా అనంతపురం జిల్లాలోని రుద్రంపేట గ్రామాన్ని, పట్టణంలోని 50వ వార్డుని దత్తత తీసుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ నిర్ణయించారని పార్టీ నాయకులు తెలిపారు. ఉత్తరాంధ్రలో, తెలంగాణలో కూడా గ్రామాల్ని జేపీ దత్తత తీసుకుంటారని, వివరాలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ, ప్రధాన కార్యదర్శి హైమా ప్రవీణ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, ప్రధాన కార్యదర్శి సోల్కర్ రెడ్డి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధులు గోవిందరావు, కూసంపూడి శ్రీనివాస్ అమీర్‌పేటలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

### గ్రేటర్ హైదరాబాద్‌లో మద్దతు పెరుగుతోంది

సురేంద్ర శ్రీవాస్తవ మాట్లాడుతూ, త్వరలో గ్రేటర్ హైదరాబాద్‌లో జరగనున్న ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ కార్యకర్తలతో చర్చించామని, రాజధానిలో లోక్‌సత్తా కార్యక్రమాలకు రోజురోజుకూ మద్దతు పెరుగుతుండటంతో పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా పాత రాజకీయమే నడుస్తుండటంతో విసిగిపోయిన ప్రజలు లోక్‌సత్తా కొత్త ప్రత్యామ్నాయ రాజకీయం పట్ల మొగ్గు చూపుతున్నారన్నారు. ఇదే ఉత్సాహంతో జీహెచ్ఎంసీ ఎన్నికలను ఎదుర్కొంటామన్నారు.

లోక్‌సత్తా పార్టీ దత్తత తీసుకున్న గ్రామాలకు ప్రభుత్వ పథకాలు చేరువయ్యేలా చేసి, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దటం తమ లక్ష్యమని హైమా ప్రవీణ్ తెలిపారు.

తెలంగాణలో 99శాతం గ్రామాలు అన్ని రంగాలలోనూ వెనకబడి ఉన్నాయని, గ్రామీణ తెలంగాణలో మార్పు తేగలిగేలా తెలంగాణలో దత్తత తీసుకోబోయే గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని పాండురంగారావు చెప్పారు.

# రాబోయే ఎన్నికల్లో లోక్'సత్తా' చాటాలి: సురేన్



ప్రజాసమస్యల నిజమైన పరిష్కారానికి లోక్‌సత్తా పార్టీ తన సత్తా చాటాల్సిన అవసరముందని పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ అన్నారు. త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా కొత్తపేటలోని ప్రజాస్వామ్య శిక్షణా శిబిరంలో కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఓట్లపరంగా లోక్‌సత్తా పార్టీ మూడవ స్థానంలో ఉందని, రాబోయే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని దిశానిర్దేశం చేశారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగారావు మాట్లాడుతూ, 2009 జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోలోని సమస్యలే ఇంకా తీవ్రరూపం దాల్చాయన్నారు. ఐదేళ్లు గడిచినా లోక్‌సత్తా మేనిఫెస్టో ఇంకా తాజాగా కనిపిస్తుండటం మాజీ కార్పొరేటర్ల, వారి పార్టీల ఘోరవైఫల్యమన్నారు. నగరంలో తాగునీటి సమస్య తీవ్రతరమైందని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేసి లోక్‌సత్తా అత్యధిక సీట్లను గెలుచుకునేలా చేయాలన్నారు.

సేఫర్ అండ్ హ్యాపీ హైదరాబాద్ లక్ష్యంగా లోక్‌సత్తా కృషి చేస్తుందని పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా ప్రవీణ్, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, ఎల్‌బీ నగర్, మహేశ్వరం, మల్కాజిగిరి నియోజకవర్గాల అధ్యక్షులు సతీష్ కుమార్, ప్రసాద్, శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో ర్యాలీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మాటలెక్కువ, చేతలు తక్కువ అని సురేంద్ర శ్రీవాస్తవ అన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్ని నెరవేర్చలేకపోతున్నారన్నారు. కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్ నుంచి ఆరవ ఫేజ్‌లోని స్విమ్మింగ్‌పూల్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గన్నారు. పార్టీ తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాండురంగారావు, సోల్కర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సురేంద్ర శ్రీవాస్తవ మాట్లాడుతూ, హైదరాబాద్‌ని విశ్వనగరంగా మారుస్తామని చెప్పి మురికికూపంగా తయారుచేస్తున్నారని, ఏ రోడ్డుని చూసినా గుంతలు, మురికినీళ్లు దర్శనమిస్తున్నాయని అన్నారు. నిరుపేదలకు ఇప్పటివరకూ ఇక్కడ ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. కూకట్‌పల్లిలో జయప్రకాష్ నారాయణ్ శాసనసభ్యునిగా ఉన్నప్పుడు స్విమ్మింగ్‌పూల్, చేపల మార్కెట్, మూసాపేట రోడ్డు, రాజీవ్‌గాంధీనగర్ బ్రిడ్జి, సున్నం చెరువు వర్షపునీటి కాలువ నిర్మాణాలకి నిధులు మంజూరు చేసినా ఇప్పటివరకూ అవి పూర్తవలేదన్నారు. గ్రేటర్ ఎన్నికలలో యువత, మహిళలకి ప్రాధాన్యత ఇచ్చి హైదరాబాద్‌లో లోక్‌సత్తా బావుటా ఎగరవేస్తామన్నారు. ర్యాలీలో లోక్‌సత్తా నేతలు లావణ్య, వంశీప్రసాద్, దుర్గారావు, దేవీప్రసాద్, గంగాభవానీ, సురేంద్ర, కిషోర్, శివ, కొండల్‌రెడ్డి, సత్యనారాయణ, జయప్రకాష్, జీవనలత, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా లక్ష గ్రామాలలో పాఠశాల విద్యా ప్రమాణాలను పెంచేందుకు 'లక్షల్లో ఒకరు'

- బండారు రామ్మోహనరావు

ఇప్పటివరకూ గ్రామీణ భారత పాఠశాల విద్యాప్రమాణాల స్థితినే వెల్లడిస్తున్న ప్రథమ్ సంస్థ, ఇప్పుడు పిల్లల ప్రాథమిక అభ్యాస స్థాయిలను, పాఠశాల విద్యాప్రమాణాలను పెంచే బాధ్యతను కూడా చేపడుతోంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న 7లక్షల్లో కనీసం 1 లక్ష గ్రామాలలో 'లక్షల్లో ఒకరు' కార్యక్రమాన్ని చేపడుతోంది.

తెలుగు నాట, దేశవ్యాప్తంగా కూడా గ్రామీణ ప్రాంతాలలో విద్యాప్రమాణాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో గణాంకాలతో సహా ప్రథమ్ సంస్థ గత పదేళ్లుగా 'అసర్' (విద్యాస్థితిగతుల వార్షిక సర్వే) ద్వారా బైటపెడుతూ వస్తోంది. 2001–02లో

## జనం జీవితాల్ని మార్చేది నాణ్యమైన చదువు తప్ప యాగాలు కాదు : జేపీ




చండీయాగాలు, అశ్వమేధ యాగాలు చేస్తే ప్రజల సమస్యలు పరిష్కారం కావని, మంత్రాలకు చింతకాయలు రాలవని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనిచ్చే నాణ్యమైన విద్య ద్వారానే జనం జీవితాలు మారతాయని, ప్రజాస్వామ్యం వికసిస్తుందని స్పష్టంచేశారు. ప్రతిభ, తెలివితేటలు వికసించే శక్తిని పాలకవర్గాలు అణగదొక్కుతున్నాయన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన 'లక్షల్లో ఒకరు' ఉద్యమ శిక్షణ, అవగాహన తొలిరోజు కార్యక్రమంలో జేపీ మాట్లాడుతూ, విద్యావ్యవస్థ ద్వారానే ప్రజాస్వామ్యం వికసిస్తుందన్నారు. ప్రజలు శక్తికి మించి విద్య కోసం ఖర్చుపెడుతున్నారని, పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. ఈ పద్ధతిని ప్రజలు బాగుచేయకుంటే నేతలు చరిత్రహీనులుగా మిగులుతారన్నారు. ఉపాధ్యాయ సంఘాలు చదువులో నాణ్యత గురించి పోరాడాల్సిందిపోయి రాజకీయ పార్టీలకు ఏజెంట్లుగా మారాయని జేపీ అన్నారు. ప్రథమ్ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రోగామ్ హెడ్ సునీత బుర్రా, సీఈవో రుక్మిణీ బెనర్జీ, ఎస్ఈఆర్టీ ఏపీ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, ఐఐసీడబ్ల్యు సంస్థ హెడ్ ఇతిహాస్ ఖురేషీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సర్వశిక్షా అభియాన్ (రాజీవ్ విద్యామిషన్)ని ప్రారంభించిన అనంతరం 2004 నుంచి అసర్ సర్వే జరుగుతూ వస్తోంది. జిల్లాకు పది గ్రామాలు, గ్రామానికి 20 ఇళ్లు చొప్పున అసర్ దేశవ్యాప్తంగా 600 జిల్లాల్లో జరిగేది. క్వార్టర్లీ పరీక్షలు పూర్తయ్యాక అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ సర్వే చేసి, జనవరిలో ఫలితాలను ప్రకటించేవారు. 5వ తరగతి పిల్లలు కూడా మాతృభాషలో తేలికైన పదాలను చదవలేకపోవటం, 8వ తరగతి పిల్లలు 2వ తరగతి స్థాయి లెక్కలు చేయలేకపోవటం వంటి అధ్వాన్న విద్యాప్రమాణాలను అసర్ బైటపెట్టింది. దేశంలోనే తొలి ప్రామాణిక విద్యాసర్వేగా చెప్పుకోదగిన, అసర్ మొదటి నివేదికను ప్రథమ్ వ్యవస్థాపకుడు మాధవ్ చవాన్‌తో కలిసి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ న్యూఢిల్లీలో ఆవిష్కరించారు.

***వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించటం ఇంకా రాజకీయానికి కేంద్రబిందువు కాలేదు. ఒక కుట్ర పన్నినట్టు మెజారిటీ ప్రజలకు ఇంకా మంచి విద్య అందకుండా చేస్తునే ఉన్నారు. ప్రజలలో చైతన్యం పెరగటం, విద్యకు డిమాండ్ ఉండటం వల్ల విద్యాహక్కు చట్టమంటూ ఆర్భాటం చేశారు. స్వతంత్రం వచ్చిన ఆరు దశాబ్దాలు గడిచాక ఇలా చట్టం తేవటంతోపాటు నిధులను పెంచినా విద్యాప్రమాణాలు పెరగలేదు. అసర్ సర్వే వాస్తవాల్నే ధృవీకరిస్తూ, ఓఈసీడీ సర్వే కూడా మనదేశం పాఠశాల విద్యాప్రమాణాల్లో 74 దేశాలలో 73వ స్థానంలో ఉందని తేల్చింది.***

తెలుగునాట అసర్ సర్వేను 2006 వరకు లోక్‌సత్తా ఉద్యమసంస్థే నిర్వహిస్తూ వచ్చింది. ఇందులో నేను కూడా భాగస్వామినయ్యే అవకాశం రావటం, ఆ తర్వాత కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ కృషిలో కొనసాగుతుండటం సంతృప్తి కలిగించే అంశం. అసర్ సర్వేలు వచ్చిన ఈ పదేళ్లలో చూస్తే, దేశభవిష్యత్తుకు పెను ప్రమాదకరమైన రీతిలో ఉన్న విద్యాప్రమాణాల గురించి ప్రజల్లో కొంత అవగాహన పెరిగినా పరిస్థితిలో ఇంకా మౌలిక మార్పు రాలేదు. యధాస్థితి కొనసాగుతోంది. వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించటం ఇంకా రాజకీయానికి కేంద్రబిందువు కాలేదు. ఒక కుట్ర పన్నినట్టు మెజారిటీ ప్రజలకు ఇంకా మంచి విద్య అందకుండా చేస్తునే ఉన్నారు. ప్రజలలో చైతన్యం పెరగటం, విద్యకు డిమాండ్ ఉండటం వల్ల విద్యాహక్కు చట్టమంటూ ఆర్భాటం చేశారు. స్వతంత్రం వచ్చిన ఆరు దశాబ్దాలు గడిచాక ఇలా చట్టం తేవటంతోపాటు నిధులను పెంచినా విద్యాప్రమాణాలు పెరగలేదు. అసర్ సర్వే వాస్తవాల్నే ధృవీకరిస్తూ, ఓఈసీడీ సర్వే కూడా మనదేశం పాఠశాల విద్యాప్రమాణాల్లో 74 దేశాలలో 73వ స్థానంలో ఉందని తేల్చింది. అలాగే ఈ పదేళ్లలో పాఠశాలల్లో నమోదు శాతం పెరిగిందికానీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. 10-15శాతం జనాభాకి అందుబాటులో ఉండే మరీ ఖరీదైన పాఠశాలల్ని మినహాయించి, మిగిలిన స్కూళ్లలో ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నా కూడా.. ప్రయివేటు పాఠశాలల్లో చదివేవారి సంఖ్య 17 నుంచి 40కి పెరిగింది. ఉపాధ్యాయుల హాజరు, వారిపై పర్యవేక్షణ తగ్గింది. ప్రభుత్వ విద్యను బాగుచేయటానికి విద్యాహక్కు చట్టం వచ్చాక ప్రయివేటు స్కూళ్లలో ఎన్‌రోల్‌మెంట్ వేగంగా పెరగటం గమనార్హం. ఈ నేపథ్యంలో, దేశ భవిష్యత్తుకి పునాదిలాంటి పాఠశాల విద్యాప్రమాణాల్లో దిగజారిన నాణ్యతాప్రమాణాలను ఇప్పటివరకూ బైటపెడుతున్న ప్రథమ్ సంస్థ, ఆ పరిస్థితిని మార్చేందుకు తనవంతు ప్రయత్నం చేయాలని సంకల్పించింది. అదే లక్షల్లో ఒకరు కార్యక్రమం.

అసర్ సర్వే కోసం గ్రామంలో 20 ఇళ్లనే తీసుకోగా తాజా లక్షల్లో ఒకరులో ఆయా ఊళ్లలోని అన్ని ఇళ్లనూ సర్వే చేస్తారు. ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా 6-14 సంవత్సరాల పిల్లలందరి విద్యాప్రమాణాల స్థితినీ నమోదు చేస్తారు. సర్వే తదుపరి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇలా సంబంధిత అందరినీ భాగస్వాముల్ని చేస్తారు. 50 గ్రామాలకు గ్రూప్ లీడర్, 5 గ్రామాలకు టీం లీడర్, గ్రామ లీడర్ ఇలా వీరంతా సర్వేను సమన్వయం చేస్తారు ప్రశ్నలు గతంలో కంటే తేలిగ్గా ఉంటాయి. ఒక చిన్న పేరాను చెప్పి ఎంతవరకు అర్థమైంది, ఒక చిన్న తీసివేత అనే రెండు ప్రశ్నలకే సర్వేను పరిమితం చేస్తారు. ఈ విద్యాప్రమాణాలను సర్పంచ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు చూపించి, ఏం చేస్తే పిల్లల చదువుల్ని బాగు చేయగలమో చర్చిస్తారు. తదుపరి కార్యాచరణను స్థానికంగా వారందరి సహకారంతో అమలు చేస్తారు. ⊕

# 'స్థానిక సాధికారతే' తక్షణ మాస్టర్ కీ

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**



***రాజకీయం చాలా మేరకు బడావ్యాపారంగా మారిపోయింది. అధికార దుర్వినియోగం, విశృంఖల అవినీతి సర్వత్రా వ్యాపించాయి. ఓట్ల కొనుగోలుకి అన్ని పార్టీలూ ఎడాపెడా ఖర్చు చేస్తున్నాయి కాబట్టి గెలవాలంటే ఇంకా ఏదో ఎర కావాలి. దీంతో, తాత్కాలిక తాయిలాలు- ఉచిత విద్యుత్తు, రుణ మాఫీ, టెలివిజన్లు, సైకిళ్లు, గ్రైండర్లు, ఉచిత బియ్యం- ఇలా రకరకాల ఎరలకు అంతం లేదు. ప్రభుత్వం చేయాల్సిన మౌలిక బాధ్యతల్ని చాలావరకూ విస్మరించారు. వ్యక్తిగతంగా ఓటర్లను ప్రలోభపెట్టటం ఎన్నికల రాజకీయ సూత్రంగా మారింది. పోటాపోటీ తాయిలాల పందెంలో కూడా అన్ని పార్టీలూ వచ్చి చేరుతున్నాయి కాబట్టి, ఓట్లను కొల్లగొట్టటానికి ఇంకా ఏదో ఎర కావాలి. పేదరికం, సంక్లిష్ట భిన్నత్వం, సాంప్రదాయ ధోరణులతో భావోద్రేకాలు ఉన్న సమాజంలో ఒకరి మీద ఒకరిని రెచ్చగొట్టి ప్రజలను చీల్చటం, రాజకీయ లాభాల్ని పిండుకోవటం తేలిక. కాబట్టి కులాల మధ్య ద్వేషాలని పెంచి ఓటుబ్యాంకులని నిర్మించుకోవటం, మతం పేరుతో వైషమ్యాలని, అభద్రతని పెంచి ఓట్లు దండుకోవటం ఎన్నికల వ్యూహంలో అంతర్భాగమయిపోయాయి.***

పరిమిత ప్రభుత్వం, స్థానిక నిర్ణయాధికారం ఉదార విలువల స్వేచ్ఛాయుత సమాజానికి, దేశానికి మూల సూత్రాలు. ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలు దఖలు పడ్డా.. ఆ పాత్ర, అధికారం వివిధ స్థాయిల్లో వ్యవస్థలకి బదిలీ అయి ఉంటే, స్వేచ్ఛకి భరోసా ఉంటుంది. ఒకే అధికార కేంద్రం ఉండే కేంద్రీకృత, నిరంకుశ వ్యవస్థకి విరుద్ధంగా వివిధ స్థాయిల్లోనూ, సమాంతరంగా వివిధ సంస్థలలోనూ అధికార వికేంద్రీకరణ ఉండటం స్వేచ్ఛను పరిరక్షిస్తూంటుంది. స్థానికంగా నిర్ణయించుకునే అధికారం పౌరులకు తమ జీవితాల మీద మరింత సాధికారతనిస్తుంది. వారు ప్రజాస్వామ్యంలో, పాలనలో ప్రభావశీల భాగస్వాములయ్యేలా చేస్తుంది.

## దార్శనికతల సంఘర్షణ


అయితే మన రాజ్యాంగం, రాజ్యం ఒక అత్యంత కేంద్రీకృత, చాలామేర ఫలితాలివ్వని పాలనా వ్యవస్థని నిర్మించాయి. ఈ పాలన ఏ రకంగానూ అధికారాల్ని ప్రజలకి పంచలేదు, ప్రజలు భాగస్వాములవ్వటానికి అవకాశం ఇవ్వలేదు. భారత రాజ్యాంగం అత్యంత మానవీయ, ఉదార విలువలకి ప్రతీక. అయితే, పరిమిత, వికేంద్రీకృత ప్రభుత్వంతో ప్రజలకు వాళ్ల జీవితాల మీద గణనీయమైన సాధికారతనివ్వాలన్న మహాత్మాగాంధీ దార్శనికతకు .. కులాలకు, అవినీతికి నిలయాలుగా ఉన్న పంచాయతీలకు అధికారాన్ని బదిలీ చేయటం వల్ల అనర్థాలు రావచ్చనే డా॥ అంబేద్కర్ ఆందోళనలకు మధ్య సంఘర్షణ తలెత్తింది. ఇద్దరి వాదనల్లోనూ బలముంది. వలస పాలన అణచివేత అనుభవంతోనే కేంద్రీకృత పాలన, రాజ్యవ్యవస్థ నియంత్రణలను గాంధీజీ తీవ్రంగా వ్యతిరేకించారు. పుట్టుకతో వివక్షను వ్యవస్థీకృతం చేసిన పలు దొంతరలతో కులకలుషితమైన సమాజం పట్ల తీవ్ర విముఖత ఉన్న అంబేద్కర్, స్థానిక సంపన్నవర్గాలు గ్రామాల్లో అధికారాన్ని సొంతం చేసుకుని, కుల వివక్షను ఇంకా ఘనీభవింపచేస్తాయేమోనని భయపడ్డారు.

గాంధీజీ, అంబేద్కర్ పరస్పర విరుద్ధ ఆలోచనల్ని సమన్వయం చేయటంలో మన జాతి నిర్మాతలు విఫలమవటం వల్ల స్వతంత్ర భారతదేశం తన ప్రస్థానంలో భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. గ్రామం అంటే ఓ ఆదర్శనీయమైన

స్వయంపాలన, స్వావలంబన కలిగిన లిటిల్ రిపబ్లిక్ అని గాంధీజీకి ఒక కాల్పనిక భావం ఉండేది. కుల వివక్షకు, మన సాంప్రదాయంలోని వ్యవస్థీకృత దుర్మార్గానికి వ్యతిరేకంగా తన జీవితపర్యంతం మహాత్ముడు పోరాడినా, శతాబ్దాల తరబడి పాతుకుపోయిన సాంప్రదాయాల్ని, స్వార్థప్రయోజనాలకు దోహదం చేస్తున్న క్రూరమైన ఆచారవ్యవహారాల్ని నైతిక బలంతోనే ఎదుర్కొని ప్రజల మనసుల్లో సమూల మార్పుని తీసుకురావచ్చని అమాయకంగా విశ్వసించారు. సాంప్రదాయల అసమానతలు నిండిన గ్రామాలలోకి రాజ్యాధికారాన్ని కూడా అందిస్తే వచ్చే ప్రమాదాలను అంబేద్కర్ గుర్తించారుగానీ, దేశంలో అందరికీ ఓటు హక్కు ఉన్నప్పుడు, స్థానికంగా గ్రామాల సముదాయానికి అధికారం బదిలీ అయితే నిజానికి కుల దొంతరల వ్యవస్థ బలహీనపడుతుందని గుర్తించటంలో విఫలమయ్యారు. సాంప్రదాయ గ్రామంలో ప్రతి కుల సమూహం గిరి గీసుకుని ఒంటరిగా జీవిస్తుంటుంది. ఎక్కువ, తక్కువ అనే వ్యవస్థీకృత అసమానతల్ని పెద్ద ప్రతిఘటన లేకుండా అంగీరిస్తుంటుంది. అయితే రాజ్యవ్యవస్థ నిర్వహణకు కొన్ని గ్రామాల సముదాయం ప్రాథమిక యూనిట్ అయితే, నిధులు, అధికారాలుగనక ఆ యూనిట్‌కి బదిలీ అయితే, సార్వత్రిక ఓటు హక్కు వల్ల వివక్షల సాంప్రదాయం బలహీనపడుతుంది. పేద, అణగారిన వర్గాల గళం బలం పుంజుకుంటుంది, వారి జీవితాల మీద వారికి పట్టు ఏర్పడుతుంది. అటువంటి సమ్మిళిత అభిప్రాయానికి రాజ్యాంగ సభ రాలేకపోవటంతో, పైన బలమైన, అనేక అధికారాలున్న కేంద్ర ప్రభుత్వం, దిగువన ఒడిదుడుకుల రాష్ట్ర ప్రభుత్వాల వ్యవస్థ ఏర్పడ్డాయి. స్థానిక ప్రభుత్వాలను భారతదేశ రాజ్యాంగ నిర్మాణంలో భాగం చేయలేదు. అనేక ఇతర ప్రవచనాలు, రాజకీయ ఉపన్యాసాలలాగానే ఈ అంశం కూడా ఆదేశిక సూత్రాలకు పరిమితమైంది.

## స్థానిక పాలనకు వేల ఏళ్ల చరిత్ర

రోజువారీ చాలా అంశాలను స్థానికంగానే సమర్థవంతంగా నిర్వహించుకున్న మన సుదీర్ఘ చరిత్రను చూస్తే స్థానిక ప్రభుత్వాలను నిర్లక్ష్యం చేయటం ఒక అసాధారణ వైఫల్యంలా కనిపిస్తుంది. 5,000 ఏళ్ల క్రితమే సింధులోయ నాగరికత మన వ్యవస్థీకృత పట్టణ జీవనానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. విశాల రహదారులు, మార్కెట్ స్థలాలు, పాలనా కార్యాలయాలు, సామూహిక స్నానఘట్టాలు, మురుగుపారుదల, పారిశుద్ధ్య వ్యవస్థలు ఉండేవి. హరప్పా లిపిని ఇంకా విశ్లేషించలేకపోయారు కాబట్టి, సువిశాల, పురాతన సింధు (పరిణతి చెందిన హరప్పా) నాగరికత పాలనా వ్యవస్థ గురించి ఇంకా మనకు నిర్దిష్ట సాక్ష్యాధారాలు అందుబాటులో లేవు. అయితే, అందుబాటులో ఉన్న ఆధారాలు, విస్తృత భౌగోళిక విస్తీర్ణం బట్టి, హరప్పా నగరం స్థానిక నిర్ణయాధికారమున్న స్వయంపాలిత నగర రాజ్యమని తెలుస్తుంది. వేదకాలంలో కూడా స్థానిక పాలన ఒక




కట్టుబాటుగా ఉండేది. 3500 సంవత్సరాల క్రితం, తొలి వేదయుగంలో కూడా రాజ్యాల చుట్టూ కాకుండా తెగల చుట్టూనే రాజకీయ నిర్మాణం ఉండేది కాబట్టి, పాలన కూడా స్థానికంగా, సమూహాల చుట్టూనే కేంద్రీకృతమై ఉండేది. మలి వేదయుగంలో కూడా, పెద్ద రాజ్యాలు కాకుండా చిన్న రాజ్యాల సూత్రమే ఉండేది. గౌతమ బుద్ధుడు, మహావీరుడు కాలంనాటికి లిచ్ఛావి గణతంత్ర రాజ్యం స్థానిక ప్రభుత్వాల వ్యవస్థకు నిలువుటద్దంగా ఉండేది. సమానత్వం ప్రాతిపదికన స్థానిక తెగలను సంఘటితం చేసి సమాఖ్యలా ఏర్పాటు చేశారు. ఇతర సమాఖ్యల్ని– విదేహ రిపబ్లిక్, వజ్జయిని రిపబ్లిక్, ప్రాచీన రచనల్లోని (అంగుట్టార నికాయ, భగవతి సూత్ర) పదహారు మహాజనపదాల ప్రస్తావన చూస్తే, స్వయంపాలిత స్థానిక సంస్థలు సమానత్వం ప్రాతిపదికన కార్పొరేషన్లుగా ఏర్పడ్డాయని అర్థమవుతుంది. 2300 సంవత్సరాల క్రితం నాటి మౌర్య సామ్రాజ్యం నుంచి మొగల్ సామ్రాజ్యం (క్రీశ 1526–1707) వరకు, సుమారు రెండు

సహస్రాబ్దుల కాలం, గ్రామాలకు తమ సొంత పాలనా వ్యవస్థ ఉండేది. పట్టణాలలో నియమిత అధికారులు, కౌన్సిల్, ఎన్నికలైన పాలనా అధికారులకు విధివిధానాలు వంటి భిన్నమైన ఏర్పాట్లతో ఈ వ్యవస్థ పనిచేసేది.

దక్షిణ భారతదేశంలో చోళుల కాలంలో స్థానిక పాలన అబ్బురపరిచే స్థాయికి ఎదిగింది. క్రీశ 920 నాటి ఉత్తరామెరూర్ శాసనం చూస్తే, ఎన్నో రకాలుగా సంస్కరించిన ఎన్నికల వ్యవస్థ, 1100 ఏళ్ల క్రితమే లిఖిత రాజ్యాంగం ద్వారా స్థానిక పాలన ఉండటం సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది. డా॥ ఆర్.నాగస్వామి ('ఉత్తరామెరూర్, తమిళనాడు చారిత్రక గ్రామం' రచయిత) అన్నట్టు, వార్డుల ఏర్పాటు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు అర్హతలు, అనర్హతకు నిబంధనలు, ఎన్నికల విధానం, ఎన్నికైన కమిటీల ఏర్పాటు, ఆ కమిటీల బాధ్యతలు తదితరాల గురించి ఆ శాసనంలో విస్తుగొలిపే వివరాలున్నాయి. గ్రామం ఒక విశాల రాచరిక వ్యవస్థలో భాగంగా ఉన్నప్పటికీ, గ్రామ రాజ్యాంగాన్ని రూపొందించటం, అమలుచేయటం మొత్తం గ్రామ అసెంబ్లీయే చేసేది. రాచరిక వ్యవస్థ కూడా ఈ స్థానిక సాధికారతను ప్రోత్సహించేది. ఉత్తరా మెరూర్ పాలనకు మార్గదర్శనం చేసే సవివర రాజ్యాంగాన్ని చదువుతుంటే ఉప్పొంగిపోతాం. సుమారు 11 శతాబ్దాల క్రితం పటిష్టమైన, శక్తిమంతమైన రాచరిక వ్యవస్థలో కూడా ప్రభావశీలమైన స్థానిక పాలనకు, ప్రజల భాగస్వామానికి ఇది అసాధారణ నిదర్శనంగా నిలుస్తుంది.

బ్రిటీషు ఇండియా వలస పాలనలో కూడా స్థానిక పాలనకు గణనీయ ప్రాధాన్యత కల్పించారు. 1688లో ఏర్పాటు చేసిన మద్రాసు కార్పొరేషన్.. బ్రిటన్‌మినహా మిగిలిన కామన్వెల్త్ దేశాల్లోనే మొట్టమొదటిది. మద్రాసు, బొంబాయి, కలకత్తా ప్రెసిడెన్సీ పట్టణాల్లో మేయర్ కోర్టుల్ని ఏర్పాటు చేస్తూ 1720లో రాజ శాసనాన్ని ప్రకటించారు. 1870లో లార్డ్ మేయో తీర్మానంతో, పూర్తిగా అధికారుల నేతృత్వంలోనే అయినా అన్ని ముఖ్య పట్టణాలలో మునిసిపాలిటీలు ఏర్పడ్డాయి. 1882లో లార్డ్ రిప్పన్.. ఎన్నికల ద్వారా ఏర్పాటైన స్థానిక స్వపరిపాలన ప్రభుత్వాల సముదాయాన్ని ప్రతిపాదించే తీర్మానాన్ని తీసుకొచ్చారు. కానీ స్థానిక పాలనలో కీలక మలుపు 1919 భారత ప్రభుత్వ చట్టం. ప్రజాదరణ గల మంత్రి నిర్వహించే విభాగానికి స్థానిక ప్రభుత్వ బాధ్యతను బదిలీ చేయటం, స్థానిక ప్రభుత్వాల ఎన్నికలకు ఓటర్ల పరిధిని గణనీయంగా విస్తరించటం, పన్నులను నిర్ణయించే అధికారాన్ని మునిసిపల్ సంస్థలకు అప్పగించటం, ఎన్నికైన కౌన్సిళ్ల ఏర్పాటు, ఎన్నికైన ఛైర్మన్‌కి కార్యనిర్వాహక అధికారాలు తదితర మౌలిక మార్పులన్నీ అక్కడ్నుంచీ వచ్చాయి.

1924లో అనేకులు ప్రముఖ భారత స్వాతంత్ర్యయోధులు స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన మేయర్లు అయ్యారు. కలకత్తాలో చిత్తరంజన్ దాస్, అహ్మదాబాద్‌లో వల్లభాయ్ పటేల్, పాట్నాలో రాజేంద్ర ప్రసాద్, అలహాబాద్‌లో నెహ్రూ మేయర్లుగా ఎన్నికయ్యారు. వలస ప్రభుత్వం నియమించే కెరీరిస్టు జోహుకుం సివిల్ సర్వీసు అధికారిని వద్దని, కలకత్తా కార్పొరేషన్‌కి యువ సుభాష్ చంద్రబోస్‌ని ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా చిత్తరంజన్ దాస్ నియమించారు. కొన్ని నెలల్లోనే బోస్ తన సామర్థ్యంతో బలమైన ముద్రను సాధించారు. విప్లవకారులకు మద్దతిచ్చారనే తప్పుడు ఆరోపణలతో 1924 అక్టోబర్‌లో బోస్‌ని అన్యాయంగా జైలులో నిర్బంధించారు. బోస్ కలకత్తాలోని అలీపూర్ జైలులో ఉన్నప్పటికీ, దాస్ పట్టుపట్టడంతో కార్పొరేషన్ సీఈవోగా జైలు నుంచే పనిచేయటానికి బోస్‌కి బ్రిటీషు ప్రభుత్వం అనుమతించింది. ఫైళ్లు ఆయనకి పంపేవారు, అధికారులు, కార్పొరేటర్లు, మేయరు కలిసేవారు, నగరాన్ని నడిపించే ఉత్తర్వుల్ని బోస్ ఇచ్చేవారు– అన్నీ అలీపూర్ జైలు నుంచే! బోస్‌ని బర్మాలోని మాండలే జైలుకి తరలించేంత వరకూ ఈ రకంగానే కలకత్తా నగర పాలన సాగింది. వలస పాలనలో కూడా ఎన్నికైన స్థానిక ప్రభుత్వాలు ఎంతటి విస్తృతాధికారాలను, స్వయంప్రతిపత్తిని అనుభవించాయో ఈ అసాధారణ ఉదంతం వెల్లడిస్తుంది.

***1924లో అనేకులు ప్రముఖ భారత స్వాతంత్ర్యయోధులు స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన మేయర్లు అయ్యారు. కలకత్తాలో చిత్తరంజన్ దాస్, అహ్మదాబాద్‌లో వల్లభాయ్ పటేల్, పాట్నాలో రాజేంద్ర ప్రసాద్, అలహాబాద్‌లో నెహ్రూ మేయర్లుగా ఎన్నికయ్యారు. వలస ప్రభుత్వం నియమించే కెరీరిస్టు జోహుకుం సివిల్ సర్వీసు అధికారిని వద్దని, కలకత్తా కార్పొరేషన్‌కి యువ సుభాష్ చంద్రబోస్‌ని ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా చిత్తరంజన్ దాస్ నియమించారు.***

భారతదేశ సుదీర్ఘ చరిత్రలో స్థానిక ప్రభుత్వాలకున్న ఈ

గణనీయ చరిత్రను చూస్తే.. స్వతంత్రం వచ్చాక ఏర్పాటు చేసుకున్న విపరీత కేంద్రీకృత వ్యవస్థ ఓ విపరిణామమే అవుతుంది. పైకి మనం పరిఢవిల్లుతున్న ప్రజాస్వామ్యంలా కనిపిస్తాం. పనిచేసే ప్రజాస్వామ్యానికి మైరన్ వీనర్ నిర్వచించిన నాలుగు ప్రాతిపదికలు– పోటీ పడి నెగ్గే ఎన్నికలు, రాజకీయ స్వేచ్ఛలు, ఎన్నికలలో ఓడిపోయినవారిపై ప్రతీకారాలు లేకపోవటం, ఎన్నికైన ప్రభుత్వాలు అధికారాన్ని ప్రభావవంతంగా వినియోగించటం– ప్రకారం భారతదేశం బ్రహ్మాండంగా విజయవంతమైన క్రియాశీల ప్రజాస్వామ్యం. రకరకాల భావోద్రేకాలు, కులం, మతం, ప్రాంతం, భాష వంటి వాటితో విభజనకు గురైన పేద, అక్షరజ్ఞానం లేని జనాభా అత్యధికంగా ఉన్నా.. ప్రజాస్వామ్యాన్ని, అందరికీ వయోజన ఓటు హక్కుని భారత్ అత్యంత సాహసోపేతంగా ఎంచుకుంది. భారతదేశం ప్రజాస్వామ్యంగా విజయవంతమవుతుందని కొద్దిమంది పరిశీలకులు విశ్వసించారు. ఒక ఐక్య దేశంగా మనందరం కలిసికట్టుగా ఉండటం, స్వేచ్ఛను, మానవ హక్కుల్ని పరిరక్షించుకోవటం, ఫర్వాలేదనిపించే ఆర్థిక అభివృద్ధిని సాధించటం ప్రజాస్వామ్య వ్యవస్థలను, సంప్రదాయాలను వరవడిగా మార్చేందుకు కృషి చేసిన తొలితరం నేతల దూరదృష్టికి నిదర్శనం.

## సంక్షోభ మూలాలు

అయితే, రాజ్యాంగంలో స్థానిక ప్రభుత్వాల నిర్మాణం పట్ల నిర్లక్ష్యం, ప్రభావశీలమైన, పటిష్టమైన, సుస్థిర, సాధికారత గల స్థానిక సంస్థలను నిర్మించటంలో గత 65 ఏళ్లలో విఫలమవటం మన ప్రజాస్వామ్యం ఎదుగుదలకు ప్రతికూలంగా మారింది. ప్రజాస్వామ్యం గతంలో ఎప్పుడూ లేనంతగా విస్తరించినప్పటికీ, లోతుగా వేళ్లూనుకోలేదని, పౌరుల పాత్ర పరిమితమవుతూనే ఉందని ప్రజాస్వామ్యవాదులు, ఆలోచనాపరులు, పౌరసమాజ పెద్దలు పలువురు గుర్తిస్తున్నారు. మన వైఫల్యాలకు కారణాలను, వాటి పరిణామాలను అర్థం చేసుకోవటానికి మన ప్రజాస్వామ్య పరిణామక్రమాన్ని నిశితంగా అవగతం చేసుకోవటం అవసరం. మన రాజ్యాంగ నిర్మాతలు అసమాన సాహసంతో వయోజన ఓటుహక్కు కల్పించారు. అయితే మనదేశంలో ప్రజాస్వామ్యం సార్థకం కావటానికి మూడు ప్రతిబంధకాలు ప్రతిరోజూ మనకు ఎదురవుతున్నాయి. మొదటిది, మన పేదరికం, నిరక్షరాస్యత ఒంటరి జీవులుగా, అభద్రతతో, భయం గుప్పిట్లో బతికే ప్రజలని అండ కోసం కుల, మత సంప్రదాయాల ఊబిలో మరింత కూరుకుపోయేలా తయారుచేశాయి. రెండోది, పౌరసత్వ భావనగానీ, ఓటు, స్వయంపాలనను అర్థం చేసుకోవటంగానీ మన ప్రజలకి సాధ్యం కాలేదు. వలస పాలన నేపథ్యంలో, ప్రజలు ప్రభుత్వాన్ని వరాలిచ్చే దేవతలాగా చూసే సంస్కృతి ఏర్పడింది. రాజ్యవ్యవస్థ ఆధిపత్యం, బలం ముందు ప్రజలు నిస్సహాయులుగా తయారయ్యారు. ప్రభుత్వమే సర్వశక్తిమంతం అనే భావన నాలుగు దశాబ్దాలకుపైగా సాగిన లైసెన్స్–పర్మిట్–కోటా విధానంతో మరింతగా బలపడింది. జీవితంలో ప్రతి అంశంపైన ప్రభుత్వం పెత్తనం, ఏదో అద్భుతం వస్తుందన్నట్టు నమ్మించిన కుహనా సోషలిజం, అడుగడుగునా ఆర్థిక స్వేచ్ఛకు సంకెళ్లు కలిసి పౌరులను నామమాత్రులుగా చేశాయి. మూడోది,



వలస పాలన అవశేషాలతో అవతరించిన పేద దేశంలో, దిగువ స్థాయి ప్రభుత్వాధికారులు ప్రజలకు సేవ చేయటం మొక్కుబడి తంతే. మెజారిటీ పౌరుల పేదరికంతో పోల్చి చూస్తే, ఒక దిగువస్థాయి ప్రభుత్వోద్యోగి కూడా చాలావరకు ఆర్థిక భద్రత కలిగినవాడై ఉంటాడు. తాను సేవలందించాల్సిన చాలామంది ప్రజలకంటే ఆ ఉద్యోగి ఎంతో శక్తిమంతుడు, పలుకుబడి కలిగినవాడు. ఈ అధికార అసమతుల్యతలు ప్రభుత్వ సేవకులకు ఆధిపత్యాన్నిచ్చి, సర్వశక్తిమంతులుగా తయారుచేసి, పౌరుల నిస్సహాయతను నిర్దాక్షిణ్యంగా దోచుకునే పరిస్థితుల్ని కల్పించింది. ఒక అవినీతి విషవలయాన్ని సృష్టించింది.

ఈ మూడు మౌలిక పరిస్థితులు – అత్యధికుల పేదరికం, నిరక్షరాస్యత; పౌరసత్వ భావం లేకపోవటం; అణగదొక్కి దోచుకునే అధికారుల వ్యవస్థతో ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు అధ్వాన్నంగా ఉండటం– నేపథ్యంలో మనం జాతీయస్థాయిలో, రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నాం. ఎందుకో తెలియపోయినా తమ ఓటుతోనే ఢిల్లీలోనో, రాష్ట్ర రాజధానిలోనో తర్వాతి రాజులెవరో తేలుతుందన్న విషయాన్ని

మాత్రం ప్రజలు చాలా త్వరగా గుర్తించారు. నిజాయతీ పాలన, రాజ్యవ్యవస్థ పాత్ర, వివిధ దశల్లో ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థల పనితీరు చాలామంది ఓటర్లకు తెలియనే తెలియదు. పనులు జరగాలంటే, తమ చేతిలో ఉన్న ఒకే ఒక్క ఆయుధం ఓటు అన్నది మాత్రమే వాళ్లకు తెలిసింది. ప్రభుత్వం అందించాల్సిన రోజువారీ సేవలు- పిల్లల చదువు, నీటి సరఫరా, వీధి దీపాలు, స్థానిక రహదారి, భూ రికార్డులు, రేషన్ కార్డు, విద్యుత్తు కనెక్షన్, ఇంటి నిర్మాణ అనుమతి, ఆసుపత్రిలో అందించే వైద్యసేవలు, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు- వంటివి నాసిరకంగా, వేధింపులతో ఉండటం వల్ల ఓటర్లు, గెలవటానికి తమ ఓటు మీద ఆధారపడిన ఎన్నికైన తమ ఎమ్మెల్యే, ఎంపీని వాటి కోసం ఆశ్రయించటం ఆనవాయితీ అయింది.

ఈ పరిస్థితిలో మార్పు తెచ్చి, ప్రజల స్థానిక అవసరాలను చాలామట్టుకు పరిష్కరించటానికి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ సేవల జారీ, ప్రభుత్వోద్యోగుల జవాబుదారీతనం, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం మీద ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు దృష్టి పెట్టి ఉండాల్సింది. అటువంటి మార్పుని తీసుకొచ్చి ఉంటే స్థానిక నాయకత్వం పెరిగి, ఓటర్ల కనుసన్నల్లోనే మెరుగైన సేవలు ప్రభుత్వ కార్యాలయాల్లో అందేవి, ఓటర్లకు కూడా తమ ఓటు వల్లనే మంచి నాయకత్వం వస్తుందని, ఓటుని సరిగా వేస్తేనే స్థానికంగా తమకు సేవలు సరిగా అందుతాయని అర్థమై ఉండేది. ప్రజలు ఓటు విలువను తెలుసుకోవటానికి ఇది దోహదం చేసి, ప్రజలలోని నాయకత్వ సామర్థ్యాలను వెలికితీసి శిక్షణకు అవకాశం కల్పించి నాణ్యమైన నాయకత్వాన్ని అందించేది. సమాజంలోనే అందరికీ తెలిసి మంచితనం, సామర్థ్యం ఉన్న పౌరులు ఎక్కడికక్కడ నాయకులుగా ఎదిగి ప్రజలకి సరైన పాలన అందించే అవకాశం ఉండేది. ఓటుకు-జాతి హితానికి మధ్య సంబంధం ప్రజల మనస్సులో పాతుకుపోయి ఉండేది. ప్రభుత్వమంటే తమ సమస్యలన్నిటికీ పరిష్కారాలు చూపించగల సర్వశక్తిమంతమైన, అపరిమిత వనరులు కలిగిన దేవతేమీకాదు, తాము చెల్లించిన పన్నుల డబ్బుతో తమ ఉమ్మడి అవసరాలను తీర్చేందుకు తాము సృష్టించుకున్న ఒక సంస్థ మాత్రమే అని ప్రజలు గుర్తించటానికి అది ఉపయోగపడేది. ప్రభుత్వ పాత్ర, తాము చెల్లించే పన్నులకు- తమకు లభిస్తున్న సేవలకు మధ్య సంబంధంపై ఇది ఓటర్లలో చైతన్యాన్ని పెంచేది. అన్నిటినీ మించి, స్థానికంగా ఎన్నికైన, సాధికారత గల నాయకులు ప్రజలకు సేవలందించే సత్తా కలిగివుండేవారు, తమను ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ఉండేవారు. స్థానిక ప్రభుత్వ నాయకులు ఎక్కడో దూరంగా, అందుబాటులో లేకుండా, ప్రశ్నించటానికి వీల్లేకుండా రహస్యమైన రీతిలో పనిచేసే బలవంతులైన నాయకుల తరహాలో కాకుండా.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మధ్యే బతుకుతూ, వారి సహచరుల్లాగా ఉంటారు. దాంతో, స్థానిక అధికార యంత్రాంగం మీద కూడా స్థానిక ప్రభుత్వ నాయకులకు గట్టి పట్టు ఉండి, జవాబుదారీతనాన్ని అమలుచేయగలిగేవారు.

జాతీయ, రాష్ట్ర స్థాయిలో అధికారాల్ని కేంద్రీకరించటం వల్ల, సాధికార స్థానిక ప్రభుత్వాలు బలంగా వేళ్లూనుకునేలా చేయకపోవటం వల్ల భారత్ పలు రకాలుగా నష్టపోయింది: పౌరుల మనసుల్లో ఓటుకి-జనహితానికి మధ్య సంబంధం లేదు, తాము చెల్లించే పన్నులు-అందుకు ప్రతిఫలంగా చట్టపరంగా అందాల్సిన సేవల గురించి ప్రజలకు అవగాహన లేదు, ఏ స్థాయిలోనూ జవాబుదారీతనం లేదు! వీటన్నిటి వల్లా, జవాబుదారీతనం, ప్రజలకు సేవలందించటం లేని ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని మనం సృష్టించుకున్నాం. ఎవరూ ఏ పనికీ బాధ్యత వహించకుండా, ఒకరి మీద ఒకరు వైఫల్యాలను నెట్టివేసే పారదర్శకత లేని, పైకి పనిచేస్తున్నట్టు కనిపించే ఒక కేంద్రీకృత వ్యవస్థ తయారైంది మనదేశంలో. అటువంటి కేంద్రీకృత వ్యవస్థలో, కేవలం కొద్దిమంది- ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టరు- మాత్రమే శక్తిమంతులుగా కనిపిస్తారు. కానీ జవాబుదారీతనం అగమ్యగోచరంగా ఉన్న వ్యవస్థలో వాళ్లుకూడా ప్రజలకు సేవలందించలేరు.

**శాసనాలు చేసే పని వదిలి ప్రభుత్వంలా నటిస్తూ సంక్షోభాన్ని ఇంకా పెంచుతున్నారు**

ఇటువంటి వాతావరణంలో, తలెత్తుతున్న ప్రజాస్వామ్య, పాలనా సంక్షోభాలకు తమకు తోచినరీతిలో ఎన్నికైన ప్రజాప్రతినిధి, ఓటరు స్పందిస్తున్నారు. అధికారాలు, నిధులు, విధులు ఉన్న స్థానిక ప్రభుత్వాలను నిర్మించి వాటిని జవాబుదారీ చేయాలని డిమాండ్ చేయకుండా, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏం చేశారంటే, ప్రజల సమస్యల పరిష్కారానికి తమకు లేని కార్యనిర్వాహక అధికారాలను చేజిక్కించుకుని అనధికార ప్రభుత్వంలా మారి నేరుగా రంగంలోకి దిగిపోయారు. ఓటర్లను సంతృప్తిపరచటానికి భారీ, సమాంతర, అనధికార రాజకీయ యంత్రాంగాన్ని తయారుచేసుకుని, ప్రజల నుంచి ఫిర్యాదుల్ని తీసుకోవటం, స్థానిక అధికారుల వద్దకు వెళ్లి ప్రజలకు-

ప్రభుత్వానికి మధ్యవర్తిత్వం చేయటం ద్వారా కనీసం కొన్ని పనులైనా జరిగేలా చేస్తున్నారు. కానీ ఈ రకమైన అనధికార, సమాంతర వ్యవస్థ వల్ల మూడు నష్టాలు తలెత్తుతున్నాయి: అధికార వ్యవస్థను జవాబుదారీ చేయకుండా, దానికి తలగ్గటం వల్ల, అనధికార రాజకీయ యంత్రాంగం సర్వశక్తులూ ఒడ్డినా కూడా, ప్రజల సమస్యలు అడపాదడపా, కొన్ని తప్ప పూర్తిస్థాయిలో పరిష్కారం కావటం లేదు. దీంతో అధికారుల పనితీరు మరింత అసమర్థంగా తయారవుతూ ప్రజలలో అసంతృప్తి మరింత ఎక్కువవుతోంది. జీతభత్యాలు లేని సమాంతర రాజకీయ యంత్రాంగాన్ని నడపటానికి డబ్బు అవసరం కాబట్టి, ఎన్నికల రాజకీయాల్లో మనుగడ సాగించటానికి భారీ అవినీతి ఓ అవసరంగా మారింది.

పనులు జరగకపోవటం వల్ల, అవినీతి వల్ల ప్రజలలో అసంతృప్తి నానాటికీ పెరిగిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి అసంతృప్తితో ఉన్న ఓటర్లకి నచ్చచెప్పటానికి రకరకాల ఎరలు అవసరమైనాయి. కాబట్టి ప్రభుత్వంలో ప్రతి పనికి లంచాల బెడద పెరిగింది. ప్రజాస్వామ్య ప్రక్రియ పట్ల ప్రజలలో ఉత్సాహం తగ్గి, క్రమంగా ఎవరోకరి ప్రాపకాల కోసం పాకులాడటం, రాజకీయాల పట్ల ద్వేషం పెరిగిపోయాయి. కాబట్టి, ఎక్కువమంది ఓటర్ల నిరుపేదరికం వల్ల ఓటు అనేది బజారులో కొనుక్కునే సరకుగా మారిపోయింది. ఓట్ల కొనుగోలు విచ్చలవిడి అయిపోయింది. ఏదో ఒకరకంగా మిగిలిన అభ్యర్థుల కంటే ఎక్కువ ఓట్లు సంపాదించినవాడికే అధికారం; మిగిలిన ఓట్లన్నీ నిరర్థకమయినవి అనే భావన కలిగించే ఫస్ట్-పాస్ట్-ద-పోస్ట్-ఎన్నికల వ్యవస్థలో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులూ ఓట్ల కొనుగోలుకు పోటీపడుతున్నారు. ఎన్నికల వ్యయాన్ని చుక్కలు తాకిస్తున్నారు. ప్రజల్ని ప్రేమించే, ప్రజల కోసం పనిచేసే గౌరవప్రదమైన నాయకులు, సమాజం కోసం పోరాడి, ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్మించేందుకు కృషి చేసేవారు నానాటికీ ప్రజాజీవితానికి, ఎన్నికలకి దూరం కావలసి వస్తోంది. రాజకీయం చాలా మేరకు బడావ్యాపారంగా మారిపోయింది. అధికార దుర్వినియోగం, విశృంఖల అవినీతి సర్వత్రా వ్యాపించాయి. ఓట్ల కొనుగోలుకి అన్ని పార్టీలూ ఎడాపెడా ఖర్చు చేస్తున్నాయి కాబట్టి గెలవాలంటే ఇంకా ఏదో ఎర కావాలి. దీంతో, తాత్కాలిక తాయిలాలు-ఉచిత విద్యుత్తు, రుణ మాఫీ, టెలివిజన్లు, సైకిళ్లు, గ్రైండర్లు, ఉచిత బియ్యం-ఇలా రకరకాల ఎరలకు అంతం లేదు. ప్రభుత్వం చేయాల్సిన మౌలిక బాధ్యతల్ని చాలావరకూ విస్మరించారు. వ్యక్తిగతంగా ఓటర్లను ప్రలోభపెట్టటం ఎన్నికల రాజకీయ సూత్రంగా మారింది. పోటాపోటీ తాయిలాల పందెంలో కూడా అన్ని పార్టీలూ వచ్చి చేరుతున్నాయి కాబట్టి, ఓట్లను కొల్లగొట్టటానికి ఇంకా ఏదో ఎర కావాలి. పేదరికం, సంక్లిష్ట భిన్నత్వం, సాంప్రదాయ ధోరణులతో భావోద్రేకాలు ఉన్న సమాజంలో ఒకరి మీద ఒకరిని రెచ్చగొట్టి ప్రజలను చీల్చటం, రాజకీయ లాభాల్ని పిండుకోవటం తేలిక. కాబట్టి కులాల మధ్య ద్వేషాలని పెంచి ఓటుబ్యాంకులని నిర్మించుకోవటం, మతం పేరుతో వైషమ్యాలని, అభద్రతని పెంచి ఓట్లు దండుకోవటం ఎన్నికల వ్యూహంలో అంతర్భాగమయిపోయాయి. శతాబ్దాల



సంప్రదాయం, ఛాందస భావాలలో కూరుకుపోయిన ప్రజలకి తమ కుటుంబాలకి, తమకి కలిగే లాభనష్టాలని అర్థంకాకుండా చేసి, కులం, మతం, ప్రాంతం పేరుతో ఉద్రేకాలని, విద్వేషాలని పెంచి ఉన్మాదులుగా మార్చేస్తే, రాజకీయ పార్టీలు మూకుమ్మడి ఓటుని సులభంగా పొందవచ్చు. కాబట్టి సమాజాన్ని ఎంతగా చీలిస్తే రాజకీయ పార్టీలకి ఎన్నికలలో అంతగా లాభం. ఈ మూడు అప్రజాస్వామిక, దిగజారుడు పరిణామాలు- ఓట్ల కొనుగోలు, పోటాపోటీ తాయిలాలు, భావోద్రేకాలతో ప్రజలను చీల్చటం- ఈవేళ మన ఎన్నికల రాజకీయాలలో అంతర్భాగమైపోయాయి.

## అధికారులు, శాసనసభ్యుల మధ్య లాలూచీల బంధం

పటిష్టమైన స్థానిక పాలన మన సమస్యలన్నిటికీ సర్వరోగనివారిణి అని చెప్పటం అతిశయోక్తి అవుతుంది. 73,74వ రాజ్యాంగ సవరణలు చాలామేర విఫలమయ్యాయన్నది వాస్తవం. భారీస్థాయిలో ఓట్ల కొనుగోలు సంస్కృతి, అధికార దుర్వినియోగం, వనరుల దోపిడీ, అవినీతి- ఇవన్నీ పైస్థాయిలోలాగే స్థానిక పాలనలో కూడా పాతుకుపోయాయి. పర్యావరణ అనుమతులు వంటి అంశాలలో స్థానికంగా

నిర్ణయాధికారం ఇచ్చిన చోట ప్రజల్ని రెచ్చగొట్టటం, లాభాలు ఆశించటం వంటి తీవ్రస్థాయి ఆరోపణలు వచ్చాయి. ఇలాంటప్పుడు స్థానిక పాలనను విశ్వసించటం మంచిదా? రాజకీయాలలో, పాలనారంగంలో, పౌరసమాజంలో, అధ్యయనంలో అర్థవంతమైన, లోతైన, ప్రజాసేవ దృక్పథం కలిగిన ఆలోచనాపరులు, కార్యకర్తలలో ఆందోళన రేకెత్తిస్తున్న ప్రశ్న ఇది. కానీ మన సమస్యలకు నిజమైన పరిష్కారాలు పౌరులకి, ప్రభుత్వానికి మధ్య దూరం తొలగిపోయి, ఎక్కడికక్కడ ప్రజలు ప్రభుత్వ నిర్వహణలో భాగస్వాములు కావటంలోనే ఉన్నాయి. పన్నులు–సేవలకు మధ్య సంబంధం ప్రజలకి అర్థమై అధికారాన్ని–జవాబుదారీతనాన్ని మరింతగా కలగలిపినప్పుడు మాత్రమే పాలన బాగుపడుతుంది. ఈ మూడు లక్ష్యాలు– ప్రజలు ప్రభుత్వంలో రోజువారీ భాగస్వాములు కావటం, పన్నుల డబ్బు ప్రజల అభీష్టం, అవసరాల మేరకు వారి కళ్లెదురుగానే ఖర్చు కావటం, అధికారం ఉన్నచోటనే బాధ్యత ఉండటం– సాధించగల సంస్థలు స్థానిక ప్రభుత్వాలు మాత్రమే. సాధికారత, ప్రభావశీలత, ప్రజల చొరవకు అవకాశం, జవాబుదారీతనం, సంబంధిత అన్నివర్గాల భాగస్వామ్యమూ ఉన్న స్థానిక ప్రభుత్వాలు, సంస్థలు మన ప్రజాస్వామ్య పునరుజ్జీవనానికి కీలకం.

1960లలో, 1970ల తొలినాళ్లలో కూడా అనేక రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు విలసిల్లాయి. అత్యున్నత ప్రమాణాల నాయకత్వాన్ని అందించాయి, ప్రజలకు గొప్ప సేవలందించాయి. ఆరోజుల్లో చాలా ప్రాంతాలలో పాఠశాల విద్య వర్ధిల్లటానికి స్థానిక ప్రభుత్వాల నేతల నాయకత్వం, దార్శనికతే కారణం. అరకొర వనరులున్నా, విద్య, నీటి సరఫరా, రోడ్లు, గ్రామ చెరువులు, ఆరోగ్యం, వ్యవసాయ విస్తరణ వంటి వాటిలో సమష్టి కృషి జరిగింది. నిజమైన స్వయంప్రతిపత్తి ఇచ్చిన కొన్నిచోట్ల పరపతి సహకార సంఘాలు విజయం సాధించాయి. సేవల అవసరం ఉన్నవారికే అధికారాన్నిచ్చి వికేంద్రీకరణ చేస్తే, సాంకేతికత, వృత్తినైపుణ్యాలను అవకాశంగా మలచుకుని ఆర్థికంగా సిరులు పండించగలమని, సమాఖ్య పద్ధతుల్లో దేశవ్యాప్త బ్రాండ్ ఇమేజ్‌ని సాధించగలమని పాల సహకార సంఘాలు శ్వేత విప్లవాన్ని తీసుకొచ్చి నిరూపించాయి. 1970ల మధ్య ఎమర్జెన్సీ కాలంలో మొదలైన భారీ రాజకీయ కేంద్రీకృత పాలన అదే బాటలో కొనసాగి స్థానిక ప్రభుత్వాలను బలహీనపరిచింది. కాలం గడుస్తున్నకొద్దీ, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం అవినీతి, కేంద్రీకృత పాలనా నమూనా నుంచి పెద్దఎత్తున తమ స్వార్థ ప్రయోజనాలను పొందటానికి అలవాటుపడ్డారు. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసేందుకు తర్వాతి దశలో చేసిన అన్ని ప్రయత్నాలూ శాసనసభ్యులు, అధికారుల మధ్య లాలూచీ వల్ల నీరుగారాయి. రాష్ట్రాలు రెండో అంచె ప్రభుత్వాలుగా ప్రజల్లో అప్పటికే వ్యవస్థీకృతంకాగా, స్థానిక ప్రభుత్వాలను ఉన్నకొద్దీ అనవసర జంఝాటంగా చూడటం మొదలైంది. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసేందుకు కొన్ని ప్రయత్నాలు చేసినా, శాసనసభ్యుల, అధికారుల వ్యతిరేకత, వనరుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మితిమీరి ఆధారపడటం, స్థానిక అధికారుల మీద కూడా రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ, అన్ని పార్టీలూ అవినీతి, అధికార దుర్వినియోగంలో మునిగితేలుతుండటంతో స్థానిక ప్రభుత్వాలు ఎక్కువకాలం మనలేవని, తమ పాత్ర నిర్వహించటంలో ప్రభావశీలంగా ఉండలేవని స్పష్టమైంది.

## నిర్మాణం జాస్తి, అధికారాలు నాస్తి

ఇలాంటప్పుడు 73, 74 రాజ్యాంగ సవరణలు ఎందుకు విఫలమయ్యాయి? 1992 సవరణలు నిర్మాణం జాస్తి, అధికారాలు నాస్తిగా రూపొంది సత్తా లేని స్థానిక ప్రభుత్వాలను సృష్టించాయి. కాబట్టి విచారకరమే అయినా వైఫల్యం అనివార్యం. మూడో అంచె పాలనావ్యవస్థకి గణనీయమైన స్థాయిలో అధికారాలు, నిధుల బదిలీని రాజ్యాంగం గ్యారంటీ చేసి, మిగతా అంశాలను రాష్ట్రాలకు వదిలేసి గనక ఉంటే, పూర్తి భిన్నమైన ఫలితాలు వచ్చి ఉండేవి. దానికిబదులు, అనేక తీవ్ర తప్పిదాలు చేశారు. గత చరిత్ర, అనుభవం ఆధారంగా స్థానిక ప్రభుత్వాలను నిర్మించే చేసే వెసులుబాటును రాష్ట్రాలకు ఇవ్వలేదు. ఉదాహరణకి, చాలా రాష్ట్రాలలో గ్రామానికి, బ్లాకుకి, జిల్లా స్థాయి స్థానిక ప్రభుత్వాలకి మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. అయితే, రాజ్యాంగ సవరణ ఓ మూస తరహాలో ప్రతి స్థాయిలో ఎన్నికైన ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటుని రుద్దింది. గతంలో చాలా రాష్ట్రాలలో స్థానిక ప్రభుత్వాల ఛైర్‌పర్సన్లను ప్రత్యక్షంగా ఎన్నుకుని ప్రజాభిప్రాయాన్ని, అధికారాన్ని మిళితం చేసే మెరుగైన ప్రయత్నం జరిగింది. అయితే అలాంటి వెసులుబాటు లేకుండా మధ్యస్థాయిలో, జిల్లా సంస్థలలో ఛైర్‌పర్సన్లను పరోక్ష పద్ధతి ద్వారానే ఎన్నుకోవాలని 73వ సవరణ ద్వారా రాజ్యాంగం స్పష్టంచేస్తోంది. అనేక రాష్ట్రాలు ఆనాటికే మహిళలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థానిక ప్రభుత్వ సంస్థలలో రిజర్వేషన్లను కల్పించాయి. అయితే, రాజ్యాంగ సవరణ రిజర్వేషన్లను ప్రాతినిధ్య కౌన్సిళ్లకే పరిమితం

చేయకుండా, వాటిని కార్యనిర్వాహక విభాగానికి కూడా విస్తరించటంతో, ప్రధాన కార్యనిర్వాహక పదవికి కూడా రొటేషన్ అనివార్యమైంది. ఫలితంగా, నాయకత్వం ఎదగటం అసాధ్యమైపోయింది. బలహీన, అస్థిర నాయకత్వం అధికారాన్ని సద్వినియోగం చేయలేకపోతున్నాయి, స్థానిక ప్రభుత్వాలకు మరింత స్వయంప్రతిపత్తిని, నిధుల్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేలేకపోతున్నాయి. అంతిమంగా, స్థానిక ప్రభుత్వాలకు నిజమైన అధికారాలు, వనరులకు సంబంధించి రాజ్యాంగం మౌనం వహిస్తూ, స్థానిక సాధికారత అంటేనే విముఖత, తిరస్కారం చూపే రాష్ట్రాల దయాదాక్షిణ్యాలకు వాటిని వదిలేసింది. దీంతో, స్థానిక ప్రభుత్వాలు చాలామేర ఉత్సవ విగ్రహాలుగా, ప్రభావశూన్యంగా, ఎన్నికలు తప్పనిసరిగా జరపటం తప్ప చెప్పుకోదగిన పాత్ర లేకుండా మిగిలిపోయాయి.

ఇటువంటి పరిస్థితుల్లో.. ఆర్థిక వికేంద్రీకరణ చేయటం ద్వారా మూడో అంచె ఫెడరలిజాన్ని పటిష్టతకు గణనీయంగా దోహదం చేసే అవకాశముంది. 14వ ఆర్థిక సంఘం నివేదిక జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు పెద్దఎత్తున వనరుల్ని బదిలీ చేసే అవకాశాన్ని కల్పించింది. ఎవరికీ సమస్య లేకుండా స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని బదిలీ చేయటానికి ఇదో మహత్తర అవకాశం. ఒక్కసారి నిధుల్ని బదిలీ చేశాక, విధులు, అధికారాలు కూడా వెన్నంటే వచ్చేస్తాయి. అయితే, ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేసే మొత్తం నిధుల బదిలీ రూ. 39.48 లక్షల కోట్లలో కేవలం రూ. 2,87,436 కోట్లను మాత్రమే స్థానిక ప్రభుత్వాలకు ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. ఇది మొత్తం కేంద్రప్రభుత్వ బదిలీలో కేవలం 7.3శాతమే. ఈ దేశంలో ప్రభుత్వం చేసే మొత్తం వ్యయంలో చాలా చిన్న మొత్తం ఇది. ప్రపంచంలో ఎక్కడైనా మొత్తం ప్రభుత్వ వ్యయంలో స్థానిక ప్రభుత్వాలకు 20-30శాతం వాటా ఉంటుంది. రాష్ట్రాలకి నిధుల బదిలీని ఇంత పెద్దఎత్తున పెంచటాన్ని స్థానిక ప్రభుత్వాలకి మరింత పెద్దఎత్తున నిధుల్ని అందించటానికి అవకాశంగా మలచుకుంటే మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలు బాగా బలపడేవి. కానీ ఓ గొప్ప అవకాశాన్ని జారవిడిచారు.

## ఆర్థిక సద్వినియోగం, స్థానిక నిర్ణయాలు

ప్రజాధనాన్ని అసంబద్ధ కార్యక్రమాలకు మళ్లించటం, ప్రభుత్వం చేయాల్సిన ప్రాథమిక బాధ్యతల్ని ఫణంగా పెట్టి వనరులని పక్షపాత ప్రయోజనాల కోసం తాతాల్కిక తాయిలాల పథకాలకు పోటాపోటీగా ఇష్టమొచ్చినట్టు వెదజల్లే సంస్కృతి పెరుగుతుండటం ఉదారవాదుల్ని, లోతైన ఆర్థికవేత్తలని, నిజమైన రాజకీయవేత్తలని, అధికారులు, పౌరులని తీవ్రంగా కలవరపరుస్తోంది. చట్టబద్ధ పాలన, అందుబాటులో న్యాయం, శాంతిభద్రతలు, పాఠశాల విద్య, నాణ్యమైన ఆరోగ్యం, కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు వీటన్నిటినీ తాత్కాలిక ఓట్ల పథకాల కోసం బలిపెడుతూ, నిధులివ్వకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. దీర్ఘకాల ప్రజాప్రయోజనాల కోసం, భావితరాల కోసం చేసే పోరాటంలో తాత్కాలిక రాజకీయ మూల్యాల్ని చెల్లించాల్సిన సంఘర్షణను ప్రజాస్వామ్యంలో రాజకీయ నేతలు



ఎదుర్కోవలసి వస్తుంటుంది. రేపటితరం భవిష్యత్తుని కాపాడాలన్నా, ఆదాయాలని పెంచాలన్నా, బీదరికాన్ని నిర్మూలించాలన్నా దీర్ఘకాలిక పథకాలు అవసరం. మంచి విద్య, ఆరోగ్యాలు అందించే వ్యవస్థని ఏర్పరచకుండా బీదల శక్తిసామర్థ్యాలని పెంచలేము. బీదల కుటుంబాలకి నైపుణ్యాన్ని పెంచి, అవకాశాలనిచ్చి, సంపద సృష్టిలో భాగస్వాములని చేసినప్పుడే బీదరికం తగ్గుతుంది, అసమానతలు తొలగిపోతాయి. ఆర్థిక వ్యవస్థ పెరగాలన్నా, జీవన ప్రమాణాలు బాగుపడాలన్నా మౌలిక సదుపాయాలు, కనీస వసతులు అవసరం. కానీ ఇవన్నీ క్షణాల మీద సంతృప్తిని కలిగించే అంశాలు కావు, చాలా ఏళ్లపాటు చిత్తశుద్ధితో కృషి చేస్తేనే జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలని కాపాడగలం. అలాకాకుండా పన్నుల డబ్బుని తాత్కాలికంగా, ఎప్పటికప్పుడు ప్రజాకర్షణ కోసం, ఏనాటికానాడు తక్షణ అవసరాల కోసం నిరుత్పాదకంగా ఖర్చు చేసి ప్రజల మద్దతుని పొంది అధికారాన్ని కాపాడుకోవటం చాలా తేలిక. కాబట్టి, హేతుబద్ధ విధానాలు, ప్రాథమ్యాలు పాప్యులర్ ప్రజాస్వామ్యంలో తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంటాయి. కేంద్రీకృత పాలనలో ఈ సంస్కృతి మరింత

ఎక్కువవుతుంది. నిరుత్పాదక సబ్సిడీలను వదిలేయటం వల్ల ప్రత్యామ్నాయ లాభాలు కేంద్రీకృత పాలనలో ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించవు. ఉదాహరణకి, వంట గ్యాస్ సబ్సిడీని అందుకుంటున్న కుటుంబాన్ని జాతి హితం కోసం ఆ వెసులుబాటును వదిలేయమన్నారనుకోండి. ఎప్పుడో భవిష్యత్తులో వచ్చే అగమ్యమైన మేలు కోసం ఇప్పుడు ఖచ్చితంగా వస్తున్న లాభాన్ని వదిలేయటం అరకొర ఆదాయవనరులతో సతమతమయ్యే కుటుంబానికి చాలా కష్టమవుతుంది. కానీ ఇదే సబ్సిడీలను స్థానిక పాలనలో అమలు చేస్తే, సబ్సిడీని వదులుకోవటం ద్వారా వచ్చే అదనపు నిధుల వల్ల లాభాలేమిటో ప్రజలకు కళ్ల ముందే కనిపిస్తుంటాయి. తాత్కాలిక తాయిలాల రాయితీలకి-వీధుల్లో భద్రత, తాగునీటి సరఫరా తదితర విలువైన ప్రజాసేవలకి మధ్య ప్రజలు అవగాహనతో ఏంకావాలో ఎంచుకునే అవకాశం లభిస్తుంది. నిధులు, అధికారాలు ఉన్న స్థానిక ప్రభుత్వాలు, స్థానిక స్థాయిలో వనరుల సృజనాత్మక వినియోగం ద్వారా మన ఆర్థిక ముఖచిత్రం మారి సద్వినియోగం, జవాబుదారీతనం పెరుగుతాయి, ప్రజలు తమ జీవితాలను బాగుచేసే అంశాల మీద దృష్టి పెట్టగలుగుతారు.

## విజయగాథలు

మనదేశంలో ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే రోజువారీ సేవలను అందించటంలో సాధించిన విజయాలన్నీ స్థానిక స్వయంపాలనతో, వికేంద్రీకరణతో వచ్చాయి తప్ప కేంద్ర హుకుంలు, నియంత్రణల ద్వారా కాదు. తమిళనాడులోని అలందూర్ మునిసిపాలిటీ 80,000 జనాభా ఉన్న ఓ చిన్న పట్టణం (ప్రస్తుతం చెన్నై కార్పొరేషన్‌లో భాగంగా ఉంది). స్థానిక వనరులతో, పౌరుల మద్దతుతో చక్కటి పారిశుద్ధ్య వ్యవస్థను నిర్మించుకున్న మొట్టమొదటి చిన్న పట్టణం ఘనతను అలందూర్ సాధించింది. దీంతో, అక్కడి ప్రజలకు కొద్దికాలంలోనే పారిశుద్ధ్యం, ఆరోగ్యం, సుందరీకరణ వంటి లాభాలతో పాటు ఇళ్ళ స్థలాల ధరలు భారీగా పెరిగిపోయాయి. అలాగే వర్గీస్ కురియన్, ప్రభుత్వ వేధింపులు, నియంత్రణల మధ్య కూడా ప్రభుత్వ సాయం లేకుండా చిన్న సహకార సంస్థల ద్వారా శ్రీకారం చుట్టిన కృషి వల్ల లక్షలాది రైతుల జీవితాల్లో గణనీయ మార్పు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో.. ప్రభుత్వ అణచివేతల నుంచి స్వావలంబన గల సహకార సంస్థలను విముక్తి చేసేందుకు నిజమైన ఉదార పరస్పర సహాయ సహకార సంస్థల (మ్యాక్స్) చట్టాన్ని 1995లో ఎన్.టి.ఆర్ అమలులోకి తెచ్చారు. ఆ తర్వాతి దశాబ్దంలో అలాంటి చట్టాన్ని మరో 8 రాష్ట్రాల్లో అమలు చేశారు. ప్రభుత్వ నియంత్రణలోని సహకార సంస్థలు చాలా మేర విఫలమై నిరంతరం మాఫీలు, సబ్సిడీలను అడుగుతుండగా, మ్యాక్స్ చట్టం కింద స్వావలంబన, స్వయంప్రతిపత్తి కలిగిన ఈ సహకార సంస్థలు పెద్దఎత్తున విజయవంతమయ్యాయి. అయినా కూడా స్వావలంబన గల సహకార సంస్థలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు తరచూ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఆర్టికల్ 19 (1) (సి) కింద సహకార సంస్థల రక్షణకు గ్యారంటీనిచ్చేలా 97వ రాజ్యాంగ సవరణను తేవటానికి పార్లమెంటుకు తోడ్పాటునిచ్చే అవకాశం నాకు లభించింది. 2012లో ఆ రాజ్యాంగ సవరణ చట్టమైంది. అయినప్పటికీ, ప్రభుత్వం సలహాలను పెడచెవిన పెట్టి,

> ***మనదేశంలో ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే రోజువారీ సేవలను అందించటంలో సాధించిన విజయాలన్నీ స్థానిక స్వయంపాలనతో, వికేంద్రీకరణతో వచ్చాయి తప్ప కేంద్ర హుకుంలు, నియంత్రణల ద్వారా కాదు. తమిళనాడులోని అలందూర్ మునిసిపాలిటీ 80,000 జనాభా ఉన్న ఓ చిన్న పట్టణం (ప్రస్తుతం చెన్నై కార్పొరేషన్‌లో భాగంగా ఉంది). స్థానిక వనరులతో, పౌరుల మద్దతుతో చక్కటి పారిశుద్ధ్య వ్యవస్థను నిర్మించుకున్న మొట్టమొదటి చిన్న పట్టణం ఘనతను అలందూర్ సాధించింది.***

అనవసరంగా, అసంబద్ధమైన రీతిలో, భాషలో 'పార్ట్ '9బి'ని రాజ్యాంగంలో చేర్చింది. ఈ భాగాన్ని గుజరాత్ హైకోర్టు సహేతుకంగానే కొట్టివేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉంది.

1986-87లో ప్రకాశం జిల్లాలో ప్రజలను సమీకరించి, వారి భాగస్వామ్యంతో, వారి సొంత పనిగా, కొత్త చిన్న సాగునీటి పథకాల ద్వారా 1,25,000 ఎకరాలకు ప్రభుత్వ పథకాల వ్యయంలో నామమాత్రపు ఖర్చుకే నీరందించే అవకాశం నాకు దక్కింది. 453 ఎత్తిపోతల పథకాలు, 70 మళ్లింపు పథకాలు, 2800 బోరు బావులతో ప్రజల భాగస్వామ్యం ద్వారా ఈ రికార్డు సాధించాను. ఈ మొత్తం స్కీముల్లో రైతులు బ్యాంకు కిస్తీలను సక్రమంగా, రుణాలను నిర్ణీత సమయానికి ముందే చెల్లించారు. ప్రభుత్వ, ప్రయివేటు పరంగా పెట్టిన పెట్టుబడులను దాటి లాభాలు చాలా స్వల్ప వ్యవధిలోనే వచ్చేశాయి. దాదాపు 20

ఏళ్లలో, రాష్ట్రంలోని 22 జిల్లాలలో అమలైన ఎత్తిపోతల పథకాల కంటే కేవలం ఒక్క జిల్లాలో మూడేళ్ల లోపల ఎక్కువ పథకాలు తక్కువ ఖర్చుతో పూర్తయినాయి! ఇస్రో, బార్క్, కొన్ని ఇతర ప్రభుత్వరంగ సంస్థలు ప్రభుత్వాల కేంద్రీకృత ధోరణులు, నియంత్రణల వల్ల కాకుండా, స్వయంప్రతిపత్తి, సాధికారతల వల్ల విజయాలను సాధిస్తూ దీపస్తంభాల్లా భాసిల్లుతున్నాయి. ప్రజలకు నిజమైన సాధికారత కల్పించి, స్థానిక ప్రయత్నాలు, సృజనాత్మకత ద్వారా తమ జీవితాల్ని తామే బాగు చేసే అవకాశాల్ని అందించినప్పుడు.. అసాధారణ విజయాలు, సుస్థిర ప్రగతి లభించిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. ఇది సార్వజనీన సూత్రం, అన్ని సంస్థలకు, వాటిలో ప్రమేయమున్న అందరికీ వర్తిస్తుంది. ఉత్తర కాలిఫోర్నియా బే ఏరియాలోని సన్నీవేల్, కుపర్టినో నగరాల మధ్య ఒక రోడ్డు మాత్రమే అడ్డం ఉంటుంది. అయితే, కుపర్టినోలోని స్థిరాస్థి ధరలు సన్నీవేల్‌లో కంటే అనేకరెట్లు ఎక్కువ ఉంటాయి. ఎందుకంటే, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు బాగా ప్రయోజనకరమైన చదువునందించే స్కూలు బోర్డు అక్కడుంది. అమెరికా చట్టం ప్రకారం, స్థానికంగా నివసిస్తూ పన్నులు చెల్లించే వారికి మాత్రమే తమ పిల్లలను స్థానిక స్కూళ్లకు పంపే అవకాశముంటుంది. దాంతో కుపర్టినోలో ఇళ్లకు భారీ డిమాండ్ ఏర్పడి స్థిరాస్థి ధరలకు రెక్కలచ్చాయి. ఈ రకంగా, పన్నుల్ని, సేవల్ని, జీవన నాణ్యతను సమ్మిళితం చేయటం.. ప్రభావశీల స్థానిక పాలనను, ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచి, ప్రజలలో ఉత్సాహపూరిత చొరవను పెంచి, సంపద సృష్టి, నూతన ఆవిష్కరణలతో అదనపు విలువ చేకూర్చటం, నాయకత్వాన్ని పెంచటం ఓ నిరంతర ప్రక్రియగా మారుతుంది.

## పరిష్కారం

ప్రస్తుతం ప్రజలను చీల్చి ఓట్లు పొందుతున్న కేంద్రీకృత రాజకీయ వాతావరణంలో మూడో అంచె ఫెడరలిజాన్ని వ్యవస్థీకృతం చేయటానికి ఏం చేయగలం? మన అనుభవాలు, ప్రపంచంలోని అత్యుత్తమ సంప్రదాయాలను ఆధారం చేసుకుని, ఈ దిగువ మార్పులను పరిగణలోకి తీసుకోవాలి:

- రాజకీయ ఏకాభిప్రాయాన్ని గనక సాధించగలిగితే, ప్రభావశీలమైన, సాధికారత కలిగిన స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులను బదిలీ చేస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి. సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన అన్ని వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసే ఏర్పాటుతో సరళమైన చట్టం చేయాలి.
- ఎన్నికైన కౌన్సిళ్లకు రిజర్వేషన్లను వర్తింపచేయాలి తప్ప కార్యనిర్వాహక ఛైర్‌పర్సన్లకు కాదు. దీనివల్ల నాయకత్వం పెరిగి నిలదొక్కుకోగలుగుతుంది.
- కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధుల్లో 33శాతానికి తక్కువ కాకుండా స్థానిక ప్రభుత్వాలకు వాటా ఇవ్వాలి. నిధులు బదిలీ చేస్తే బాధ్యతలు, సిబ్బంది వాటంతటవే వచ్చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలనుకుంటుంది కాబట్టి, వాటిని బదిలీ చేసేస్తుంది.
- స్థానిక ప్రజలు నిర్ణయాలలో భాగస్వాములై, వికేంద్రీకరణ ఫలితాలను పొందేందుకు వీలుగా స్థానిక ప్రజాబృందాలకి, స్టేక్‌హోల్డర్ బృందాలకే నిధుల బదిలీ చేయాలి. ఉదాహరణకి, చిన్న పంచాయతీ, మునిసిపల్ వార్డు కమిటీ, ఒక కాలనీ, లేదా బస్తీవాసుల బృందాలు ప్రజలకు చేరువగా ఉంటాయి. వనరులు, నిర్ణయాధికారాలు వాటి నుంచే రావాలి.
- విద్య, ఆరోగ్యం, నీటి నిర్వహణ, ఇతర రంగాలలో స్థానిక స్థాయిలో సేవల అవసరం ఉన్న బృందాలకే పూర్తి అధికారం, జవాబుదారీతనంతో పారదర్శకంగా సాధికారత కల్పించాలి
- ప్రతి జిల్లాలో, ప్రధాన నగరంలో స్వతంత్ర ప్రతిపత్తిగల సాధికార అంబుడ్స్‌మన్ వ్యవస్థను చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలి. వనరులతో పాటు ఎన్నికైన రాజకీయ నేతలు లేదా స్థానిక ప్రభుత్వాలలోని అధికారులు అవినీతికి పాల్పడితే వేగంగా విచారణ చేసి, దోషులకు జరిమానా, శిక్ష విధించే అధికారాన్ని ఇవ్వాలి.
- శాసన మండలి (ఉన్న రాష్ట్రాలలో) ఏర్పాటుని ఆర్టికల్ 171 కింద మార్చి, స్థానిక ప్రభుత్వాల మండలిగా చేయాలి. జాతీయ స్థాయిలో రాజ్యసభ రాష్ట్రాల కౌన్సిల్‌లా ఉన్నట్టు, పట్టణ, గ్రామీణ స్థానిక ప్రభుత్వాల సమాహారంగా శాసన మండలి ఉండేలా చేయాలి.
- గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలతో కూడిన ఎన్నికైన, ప్రభావశీల జిల్లా ప్రభుత్వం ఉండటం మూడో అంచె ఫెడరలిజం లక్ష్యం. భారతదేశంలోని ఒక జిల్లా.. ప్రపంచంలోని సగానికిపైగా దేశాలకంటే పెద్దది. విస్తృత వైవిధ్యం కలిగినది. కాబట్టి రాజకీయ భాగస్వామ్యానికి, సంఘటిత కార్యక్రమాలకు నిజమైన యూనిట్ – జిల్లా!

- గందరగోళం లేకుండా చేసేందుకు, స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం, రాష్ట్రాల స్థాయి సాధికారతను ఇచ్చేందుకు, పార్లమెంటుకి, శాసనసభకి, స్థానిక ప్రభుత్వాలకి ఒకే ఎన్నికల సంఘం, ఉమ్మడి ఓటర్ల జాబితాలు ఉండటం అవసరం.
- దాదాపు 10,000 జనాభాతో గ్రామాల సమూహం స్వయంపాలనకు యూనిట్‌గా ఉండేలా గ్రామ పంచాయతీల పునరుజ్జీవనానికి కలసికట్టు ప్రయత్నం చేయాలి. ఇది గ్రామంలోని సాంప్రదాయ వివక్షల వ్యవస్థల్ని బలహీన పరిచి ఆర్థికస్థాయిని, కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి అవకాశాల్ని పెంచుతుంది. స్థానిక ప్రభుత్వాలను వృత్తినైపుణ్యంతో నిర్వహించే సామర్థ్యాన్ని విస్తృతం చేస్తుంది.
- స్థానిక పోలీసులు చేసే చిన్న నేరాల విచారణ, ట్రాఫిక్ నిర్వహణ, గస్తీ, చిన్నచిన్న శాంతిభద్రతల సమస్యలు వంటివి స్థానిక నియంత్రణలో ఉండే ఏర్పాటు చేయాలి.
- 2009లో వచ్చిన గ్రామ న్యాయాలయాల చట్టాన్ని స్థానిక న్యాయస్థాన చట్టంగా అన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలి. స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేసి, ఇవి చిన్న సివిల్, క్రిమినల్ కేసుల్ని సంక్షిప్త పద్ధతుల్లో జాప్యం లేకుండా హైకోర్టు పర్యవేక్షణలో విచారణ చేయటాన్ని స్వతంత్ర న్యాయవ్యవస్థలో అంతర్భాగం చేయాలి.
- విద్యుత్తు, నీటి సరఫరా, రహదారులు, స్థానిక పోలీసు, స్థానిక కోర్టులు- ఇలా అన్ని సేవలనూ కలిపి అందించేందుకు వివిధ విభాగాల పరిధిని వీలున్నంత వరకు ఏకీకృతం చేయాలి
- అవకాశమున్నంత వరకూ పౌరసేవలన్నీ ఒకే గొడుగు కింద ఉండాలి. జర్మనీలో, పాస్‌పోర్టు సేవల కోసం కూడా ప్రజలు మునిసిపాలిటీ వద్దకు వెళ్తారు. పాస్‌పోర్టు ఫెడరల్ ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ప్రజలకు ఆ సేవను అందుబాటులోకి తెచ్చేది స్థానిక ప్రభుత్వమే.
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలకి నిర్ణీత కాలవ్యవధిని ఏర్పాటు చేసి, ఆ గడువులోగా అందించలేకపోతే రోజుకి కొంత డబ్బుని జరిమానా చెల్లించేలా సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలి
- ప్రతి నగరంలో, స్థానిక ప్రభుత్వాల సముదాయంలో కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి, పౌరులు నేరుగా తమకు ఆ నిర్దిష్ట సేవనందించాల్సిన సంస్థ లేదా అధికారితో అనుసంధానమయ్యేలా చేయాలి. ప్రజలకు సేవలు సక్రమంగా అందుతున్నాయో లేదో కూడా పూర్తయ్యేంత వరకూ పర్యవేక్షించాలి.
- ప్రభుత్వ విధానాలను, చట్టాలను రూపొందించటానికి, ప్రజాధనం వినియోగంపై సూచనలివ్వటానికి, సాధికార, ప్రభావశీల సభా సంఘాల ద్వారా, సభా పద్ధతుల్ని, ప్రక్రియల్ని మెరుగుపరచటం ద్వారా ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయటానికీ చట్టసభ సభ్యులకు మరింతగా అధికారిక బాధ్యతలను కల్పించాలి.

## కీలకఘట్టంలో ఇది అత్యంత కీలక అడుగు

మన ప్రజాస్వామ్యం ఒక కీలక ఘట్టంలో ఉంది. మన ఉదార ప్రజాస్వామ్య వ్యవస్థలు మనకు ఎంతో ఉపకరించాయి, మనం ఒక ఉమ్మడి భావంతో, స్థిరమైన ప్రజాస్వామ్య రాజకీయ దేశంగా మనగలిగాం. మన స్వేచ్ఛల్ని కాపాడుకుంటూ ఫర్వాలేదనిపించే స్థాయి అభివృద్ధిని సాధించగలిగాం. కానీ, ఇతర సమాజాలతో పోల్చి చూసుకుంటే మాత్రం మనం సామర్థ్యానికి తగ్గట్టు ఫలితాలను సాధించటంలో పెద్దఎత్తున విఫలమయ్యాం. ఆర్థిక దిగ్గజంగా, ప్రపంచశక్తిగా అవతరించగల అవకాశం మనకుంది. కానీ ప్రజల్ని పాలనలో భాగస్వాముల్ని చేసి, మూడో అంచె ఫెడరలిజానికి సాధికారతనిచ్చి, అట్టడుగు స్థాయిలో ప్రజల సామర్థ్యాన్ని వెలికితీసి నాయకత్వాన్ని పెంపొందిస్తేనే నిజమైన అభివృద్ధి, ప్రగతి సాధ్యమవుతాయి. ఇప్పటికే ఆరుదశాబ్దాల విలువైన సమయాన్ని వృధా చేసుకున్నాం. పాలనలో ప్రజలకు పాత్ర కల్పించటంలో వైఫల్యం, ప్రజలకు రోజువారీ ప్రభుత్వ సేవల్ని అందించటంలో అసమర్థత వల్ల ఈదేశం భారీ మూల్యం చెల్లించింది. యథాస్థితిని కొనసాగించటం నానాటికీ అసాధ్యమవుతుంది. మన భవిష్యత్తుకి కూడా అది తీవ్ర నష్టదాయకం. మన ప్రజాస్వామ్యాన్ని ప్రజల ఆకాంక్షలకనుగుణంగా చురుకైన క్రియాశీల జనరాజకీయస్వామ్యంగా మార్చి మన సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వికసింపచేసేందుకు చాలా చేయాల్సుంది. ఈ మౌలిక మార్పులో అత్యంత కీలకం, తక్షణావసరం స్థానిక ప్రభుత్వాలకు, అందులో సేవల అవసరమున్న బృందాలకి సాధికారత కల్పించటం. ⊕

### పోలీసు దందాలు, రైతుల సొమ్ము రూ.1000 కోట్లు దోచేసినా దిక్కులేని పాలనతో

# పెట్టుబడులు రావు, నక్సలైట్లు పెరుగుతారు: జేపీ




**కరీంనగర్ కేంద్రంగా పోలీసు దందాపై ఇప్పటికే చాలా వివరాలు వచ్చి ప్రభుత్వం కూడా స్పందించి నందున సాంకేతికాంశాల జోలికిపోనని, అయితే విపరీత వడ్డీలకు అప్పులిచ్చి, బెదిరించి, ఆస్తుల్ని లాగేసుకోవటం వల్ల నష్టపోయిన వందలమందిలో రైతులే ఎక్కువగా ఉన్నారన్న వాస్తవం ఓ హెచ్చరికని అన్నారు.**

తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లలో పరిపాలన ఎంత అధ్వాన్నంగా ఉందో కరీంనగర్ కేంద్రంగా పలువురు పోలీసుల చట్టవ్యతిరేక కలాపాలు, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పత్తి రైతులకు దక్కాల్సిన రూ.1000 కోట్లు కైంకర్యం చేయటం అద్దం పడుతున్నాయని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. హైదరాబాద్‌లో, అమరావతిలో తప్ప మిగిలిన చోట్ల ఎక్కడా ప్రజలకు భద్రత, కనీస సౌకర్యాలు ఉండవంటే.. ముఖ్య మంత్రులు సింగపూర్, చైనాలు ఎన్నిసార్లు తిరిగినా పెట్టుబడులు రావన్నారు. జనం చస్తున్నా పట్టించుకోకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రభుత్వోద్యోగులకు పోటాపోటీగా 42 శాతం జీతాల్ని పెంచారని, 7వ వేతనాల సంఘం జీతాల పెంపు నివేదిక వచ్చిందని, కానీ అధికార దుర్వినియోగం, అవినీతి లేకుండా వారి చేత ప్రజలకు సేవచేయించే సరైన రాజకీయ వ్యవస్థ లేకుండా పోయిందన్నారు. ఎక్కువమంది ప్రభుత్వోద్యోగులు, రాజకీయ నేతలు, ఎన్నిక కాని ఛోటా నాయకులు ప్రజలను దోచుకుంటున్నారని, ఇలా ప్రజల్ని బానిసలుగా చూస్తూ అణచివేస్తుండటమే నక్సలిజానికి కారణమవుతోందన్నారు. నక్సలైట్ పంథా కరెక్ట్ కాకపోయినా, దాని వెనక కారణాల్ని వెతికి ప్రభుత్వాలు పరిష్కరించాల్సిందేనని అన్నారు.

**కరీంనగర్‌లో బొబ్బల మోహన్‌రెడ్డి అనే ఓ దిగువస్థాయి పోలీసు అధికారి వడ్డీ వ్యాపారం పేరుతో చేసిన అకృత్యాలు, అందులో పలువురు బడాబాబులుకూడా ఉండటం, ఆంధ్రప్రదేశ్‌లో సీసీఐ రైతుల డబ్బును రూ.1000 కోట్ల మేర దోపిడీ చేసినా చర్యలు లేకపోవటంపై జయప్రకాష్ నారాయణ్ అమీర్‌పేటలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వడ్డీ దోపిడీ బాధితులు లక్ష్మి, వీరమ్మ, గోరెబీ దంపతులు తదితరులతోపాటు బాధితుల సంఘం అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, కొమురయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సేవామండలి (కడప) ప్రతినిధులు కటారు రామసుబ్బారెడ్డి, బొడ్డు శేషయ్య,**

**స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య కన్వీనర్ పి. భాస్కరరావు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎన్. శ్రీనివాస్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.**

రూ. 20లక్షలు అప్పు తీసుకుంటే రూ. 3కోట్ల విలువ చేసే భవనాన్ని పదకొండు నెలల్లో మోహన్‌రెడ్డి ఎలా స్వాధీనం చేసుకున్నాడో, రూ. 35లక్షల అప్పునకు 16కోట్ల విలువైన పొలాన్ని ఎలా జీపీఏ చేయించుకుని ఆ తర్వాత స్వాధీనం చేసుకున్నాడో బాధితులు కన్నీటితో వివరించారు. రూ. 35లక్షలతో కొనుగోలు చేసిన తన ఇల్లును తనఖా పెట్టి రూ. 5 లక్షలు అడిగితే, జీపీఏ కింద రూ. 4లక్షలు ఇచ్చి, ఆ తర్వాత తుపాకీతో బెదిరించి ఇల్లు ఖాళీ చేయించి స్వాధీనం చేసుకున్నాడని, దీంతో హైదరాబాద్ వచ్చి ఆటో నడుపుకుంటున్నానని, చదువుకోవాల్సిన పిల్లల్ని బట్టల షాపుల్లో చిన్న ఉద్యోగాలలో చేర్చానని ఓ బాధితుడు ఆక్రోశించారు. మోహన్‌రెడ్డి కేసుపై లోక్‌సత్తాకు 54మంది బాధితులు లిఖితపూర్వక ఫిర్యాదునిచ్చారని, ఈ కేసులో అనేకమంది పోలీసు అధికారుల ప్రమేయమున్నందున సీబీఐ విచారణను పరిశీలించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

**అనంతరం జేపీ మాట్లాడుతూ,** కరీంనగర్ కేంద్రంగా పోలీసు దందాపై ఇప్పటికే చాలా వివరాలు వచ్చి ప్రభుత్వం కూడా స్పందించినందున సాంకేతికాంశాల జోలికిపోనని, అయితే విపరీత వడ్డీలకు అప్పులిచ్చి, బెదిరించి, ఆస్తుల్ని లాగేసుకోవటం వల్ల నష్టపోయిన వందలమందిలో రైతులే ఎక్కువగా ఉన్నారన్న వాస్తవం ఓ హెచ్చరికని అన్నారు. రైతు ఆత్మహత్యల వెనక బలమైన కారణాన్ని ఈ కేసు బైటపెడుతోందన్నారు. అప్పిచ్చువాడు, వైద్యుడు లేని చోట నివాసమే అసాధ్యమని సుమతీ శతకంలో చెప్పారని, అయితే రుణమాఫీల పేరుతో మభ్యపెట్టి ఓట్లు దండుకోవటం తప్ప, రైతులకు సరైన పరపతి వ్యవస్థ, ప్లెడ్జి రుణాలు లేకుండా చేయటం వల్లే ఎక్కువమంది ఇలాంటి వడ్డీలబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, బజారున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఒక్కచోటైనా రైతులకు పంట తనఖా పెట్టుకుని ఇచ్చే ప్లెడ్జి రుణాలు అందించినట్టు రుజువు చేయగలరా అని సవాలు చేశారు. చట్టబద్ధపాలన లేని ఒక అరాచక వ్యవస్థలో, ఓట్ల కోసం జనాన్ని మోసం చేసి అధికారంలోకి వచ్చి ఆ తర్వాత దోచుకుంటుంటే, బలమున్నవాడిదే రాజ్యమవుతుందని, లాఠీల్ని ఝుళిపిస్తూ, తుపాకీల్ని గురిపెడుతూ ఉంటారని, కరీంనగర్ కేసులో అదే జరిగిందని అన్నారు. ఒక వికృత రాక్షస క్రీడగా రాజకీయాన్ని తయారుచేశారని, ఇందుకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదనటానికి వరంగల్ ఉప ఎన్నికలో వెదజల్లిన డబ్బే నిదర్శనమన్నారు.

**కరీంనగర్ కేసులో బాధితులను ఆదుకునేందుకు, భవిష్యత్తులో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి దుర్మార్గాలు పునరావృతం కాకుండా ఉండేందుకు నేపథ్యంలో తక్షణం ఈ దిగువ చర్యలు చేపట్టాలని జేపీ ప్రభుత్వాల్ని డిమాండ్ చేశారు:**

"1) గత పదేళ్ల కాలంలో జీపీఏలు పెట్టుకుని బదిలీ చేయించుకున్న స్థిరాస్థుల లావాదేవీలు మొత్తాన్నీ రద్దు చేయాలి. భయపెట్టి, బలవంతంగా లావాదేవీలు జరిపిన దోషులు కోర్టులకెళ్లినా ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడి చట్టపరంగా పోరాడాలి. ఆ బాధ్యత, అధికారం ప్రభుత్వానికుంది.

2) ఇప్పుడు దొరికిన ఆస్తుల పత్రాల ఆధారంగా అసలుని మినహాయించి ఆ అప్పుల్ని రద్దు చేయాలి.

3) పెళ్లిళ్ల ఆర్భాటాలకు అప్పులు ఇవ్వనక్కర్లేదుగానీ, చదువు, ఆరోగ్యం, ఇతరత్రా అవసరాలకు డబ్బు అప్పు ఇచ్చేందుకు రెగ్యులేటెడ్ వ్యవస్థను రూపొందించాలి. లోక్‌సత్తా చొరవతో వచ్చిన 97వ రాజ్యాంగసవరణతో సహకార సంస్థలకు లభించిన స్వయంప్రతిపత్తిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలి. తేలిగ్గా, చట్టబద్ధంగా అప్పిచ్చే వ్యవస్థ లేకుండా సంక్షేమాలు, సోషలిజాలు ఎందుకు?

4) 1930లలో అమల్లోకొచ్చిన వడ్డీ చట్టమే (1349 ఫస్లీ) ఇప్పటికీ తెలంగాణలో కొనసాగుతోంది. ఎంత వడ్డీ విధించొచ్చు అనే అంశంలో ఈ చట్టంలో స్పష్టత లేదు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకు రేట్ల కంటే 2శాతం అదనంగా అని అసంబద్ధమైన రీతిలో చట్టం ఉంది. రెండు రాష్ట్రాల్లో చట్టాల్ని సవరించి నెలకు వడ్డీ రూ. 2.00–2.50 మించకుండా, జీపీఏ తీసుకోకుండా, చట్టప్రకారం, పారదర్శకంగా అప్పిచ్చేలా వెంటనే చర్యలు తీసుకోవాలి. జీవోలను రహస్యంగా అమలు చేస్తున్నారు. నాబోటి వాళ్లకే అర్థంకాకపోతే ఇక సామాన్య ప్రజలు దోపిడీకి గురికాక ఏమవుతారు?

5) బలమైన, నిష్పాక్షికమైన, సమర్థమైన పోలీసు యంత్రాంగం లేకపోతే సమాజం బతకదు. అదేసమయంలో, పోలీసుల్లో అసమర్థుల్ని, దొంగల్ని, దోపిడీదారుల్ని, అధికార దుర్వినియోగానికి పాల్పడేవారిని కఠినంగా శిక్షించే ఏర్పాటు కూడా కావాలి. ఈ దిశగా పోలీసు సంస్కరణలు తేవాలి"

ఈ పరిష్కారాలతో ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని, మాటలకే పరిమితంకాకుండా చర్యలు తీసుకోవాలని కోరతానని జేపీ తెలిపారు.

**రైతుల సొమ్ము ఇన్ని కోట్లు దోచినా చర్యలు లేవంటే, అది ప్రభుత్వమా? దొంగలముఠానా?**

ఆంధ్రప్రదేశ్‌లో 2014-15 సీజన్‌లో 19లక్షల ఎకరాలలో పత్తి వేశారని, 1కోటీ 50లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి రావటంతో పత్తి ధర బహిరంగ మార్కెట్‌లో రూ.2,800-3,200 మాత్రమే ఉందని, రైతుల నిస్సహాయ పరిస్థితిని అవకాశంగా తీసుకుని సీసీఐ అధికారులు రూ.1000 కోట్ల మేర దోచేశారని జేపీ అన్నారు. సీసీఐ అధికారులు కర్నూలు, ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో 43 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా మద్దతు ధరకు కొనుగోలు చేయకుండా గ్రామాల్లో దళారుల ద్వారా రూ.2,800-3,200కే కొనుగోలు చేశారని, రికార్డుల్లో మాత్రం మద్దతు ధర రూ.4,050కే సీసీఐ కేంద్రాలలో కొనుగోలు చేసినట్టు రాసుకున్నారని తెలిపారు. ఇలా దళారుల ద్వారా 90లక్షల టన్నులు కొనుగోలు చేశారని, కేంద్రాలలో కేవలం 3లక్షల టన్నులే కొన్నారని అన్నారు. ఈ దోపిడీ మీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కొన్ని సీసీఐ కేంద్రాలలో విచారణ చేసి ధృవీకరించినా, సీబీఐ (విశాఖపట్నం) ఎఫ్ఐఆర్ నమోదు చేసినా ఇంతవరకూ ఒక్క అధికారి మీద కూడా చర్యలు లేవని, ఎవరినీ అరెస్టు కూడా చేయలేదని అన్నారు. మిగిలిన సీసీఐ కేంద్రాలలో అసలు విచారణే జరగలేదన్నారు. దీనిమీద రైతు సంఘం నాయకులు రామసుబ్బారెడ్డి, శేషయ్య ఫిర్యాదు చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ స్పందించలేదన్నారు. లోక్‌సత్తా చొరవ వల్ల 2012లో పత్తి ఎగుమతులను అనుమతించటం వల్ల రైతులకు క్వింటాలుకు రూ.7,000 పైచిలుకు ధర లభించిందని, ఇప్పుడు అంతర్జాతీయ మాంద్యం ఉన్నప్పుడు భరోసా ఇవ్వాల్సిన దబ్బున్నా సక్రమంగా ఇస్తే రైతు బతుకుతాడన్నారు. దోచేసిన రూ.1000 కోట్లు గనక పత్తి రైతులకే దక్కి ఉంటే, కనీసం ఎకరాకి రూ.10,000 అదనంగా వచ్చి ఉండేదని, రైతుల కోసమంటూ ఉపన్యాసాలివ్వటం తప్ప రైతులకు పనికొచ్చే పనిచేసే పనులే చేయని ప్రభుత్వం నడుస్తోందన్నారు. ప్రభుత్వానికి చెవులు, కళ్లుగా ఉండే జిల్లా కలెక్టర్లు ఏమయ్యారు? అంత దద్దమ్మల్లా, ఎమ్మెల్యేలు, మంత్రులకు జోహుకుం అంటున్నారా? ఉద్యోగులు కార్లు, ఫోన్లు, ఫ్యాన్లు వంటి వైభోగాలు అనుభవిస్తున్నారా? అది ప్రభుత్వమా? దొంగల ముఠానా? అని ప్రశ్నించారు. వరంగల్ లోక్‌సభ ఉప ఎన్నికలో ఎవరు గెలిచారు లాంటి విషయాల కన్నా ఇలాంటి అంశాల్ని తుదకంటా తీసుకెళ్లి పరిష్కారం చూపి ప్రజల పక్షాన నిలవాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు ఇకనైనా కళ్లు కనిపించి, చెవులు వినిపించాలని, గుండె కదలాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ⌖

## అవినీతి లేని సేవలందించేందుకు సిటిజన్ ఛార్టర్లు అమలు చేయాలి

## -ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఏసీబీ సిఫార్సు-

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెచ్చరిల్లిపోతోందని, రెవిన్యూ, రవాణా, సాంఘిక సంక్షేమ శాఖ, పోలీసు, విద్య, వైద్యం, వాణిజ్యపన్నులు ఇలా పలు శాఖల్లో ప్రజల నుంచి రూ.500 నుంచి 1లక్ష దాకా లంచాల్ని గుంజుతూ వేధిస్తున్నారని, ఇందుకు ఆన్‌లైన్ సేవలను అందించటంతోపాటు సిటిజన్ ఛార్టర్లను అమలు చేయాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన నివేదికలో ప్రభుత్వానికి సూచించింది. ఇలా సర్వీస్ గ్యారంటీ చట్టం కోసం లోక్‌సత్తా 1998 నుంచి కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. జాతీయస్థాయిలోను, రాష్ట్రాలలోనూ హక్కుగా ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలందించేందుకు లోక్‌సత్తా రూపొందించిన దేశవ్యాప్త చట్టం ఇప్పటికే పార్లమెంటు ముందుంది.

# కొలీజియం ఒక ఎలీట్ క్లబ్, కొందరికే ప్రవేశం

- పి.వి గోపాలకృష్ణ

ఉన్నత న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి జాతీయ న్యాయనియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)ని సుప్రీంకోర్టు కొట్టివేశాక ఈదేశ చరిత్రలో మొదటిసారిగా ఆ అంశంపై విస్తృత చర్చ మొదలైంది. ఇది ఏదో ఒక పార్టీకి సంబంధించిన సొంత ఎజెండా కాదు. ఇరవై ఏళ్లకి పైగా నలుగుతున్న విషయం.

మనది ప్రజాస్వామ్య దేశం. అంటే రాజ్యాంగబద్ధమైన పరిపాలనా విధానం ఉండాలి అన్నది అందరూ ఒప్పుకునే, ఒప్పుకోవలసిన సూత్రం.

ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? రాజ్యాంగబద్ధమైన వరిపాలనా విధానం అంటే ఏమిటి? అనగానే స్వాతంత్ర్యదినోత్సవానికో, రిపబ్లిక్ దినోత్సవానికో ప్రజల కొరకు, ప్రజల వలన, ప్రజల యొక్క అంటూ రొద్దకొట్టుడు వ్యాసాలు రాసి, స్టేజీలెక్కి ఉపన్యాసాలు దంచటం అలవాటయిన మనకి.. ప్రజాభిప్రాయం అంటూ ఒకటి ఉంటుందని, దాని ప్రకారం పరిపాలనా విధానాలను కూడా మార్చుకోక తప్పదు అని స్పృహ లేకుండా పోయింది. ప్రజాభిప్రాయ సేకరణ ప్రజాస్వామ్య ప్రాథమిక అవసరం. దానికి మన స్వతంత్ర భారతంలో ప్రయత్నం వ్యవస్థీకృతంగా ఈనాటి వరకూ జరగలేదు. దేశ జనాభా, నిరక్షరాస్యత దృష్ట్యా దానికి అవకాశం లేదని కొందరి నిశ్చితాభిప్రాయం. ఐదేళ్ల పాటు నియోజకవర్గ ప్రజల మొహం చూడాల్సిన అవసరంలేని మన ప్రతినిధులకి ఇది రోగి కోరిన మందు. రెఫరెండం–అప్లయిడ్ సివిక్స్‌లో ఇది మనం నేర్చుకోని, నేర్పించని పాఠం.

ఎన్‌జేఏసీ చట్టానికి రాజ్యాంగబద్ధత లేదని సుప్రీంకోర్టు తామే సుప్రీం అని నిర్ణయించిన తర్వాత, కొలీజియం వ్యవస్థలో పారదర్శకత కోసం నవంబర్ 3 నుంచి జరిగేది ఒక తంతు. కొన్ని అభ్యంతరాలుండొచ్చుగానీ, ఒకసారి ఎన్నికైన ప్రజాప్రతినిధులు అందరూ ఒప్పుకుని ఏకగ్రీవంగా పార్లమెంటు ఆమోదం పొందిన చట్టాన్ని సుప్రీంకోర్టు ప్రజాభిప్రాయంగా గుర్తించలేదు. ఇక క్రియాశీల ప్రజాస్వామ్యంలో ప్రజల కొరకు, ప్రజల వలన, ప్రజల యొక్క అన్న ప్రజాస్వామ్య మౌలిక సూత్రం కేవలం కాగితాలకి, ఛానళ్లలో ఊకదంపుడు చర్చలకి మాత్రమే పరిమితమైపోయే ప్రమాదముంది.

1993కి ముందుగానీ, ఆ తర్వాతగానీ అభ్యంతరకర నియామకాలు జరిగి ఉండవచ్చు. కానీ కొలీజియం వ్యవస్థకి ముందు జరిగిన నియామకాలన్నీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217కి లోబడే జరిగాయన్నది నిర్వివాదాంశం. కొలీజియం ద్వారా జరిగిన కొన్ని అవకతవక నియామకాలు కేవలం ప్రజాభిప్రాయానికి ఉన్న ప్రాముఖ్యత వల్ల నిలిచిపోయాయన్నది సత్యం. దినకరన్ నియామకం ఆగిపోవడంలో కొందరు మద్రాస్ బార్ సభ్యుల క్రియాశీలపాత్రని మర్చిపోగలమా?



ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయ సేకరణ అనివార్యం. మన సాంకేతిక పరిజ్ఞానం విజయాలు, మంగళ్‌యాన్‌ప్రయోగంలో ఇస్రో సాధనల గురించి ఇంత చెప్పుకుంటున్న మనకి పోలింగ్ బూత్ స్థాయిలో ప్రజాభిప్రాయం సక్రమంగా జరిగేలా చూడటం చేతకావటం లేదు. సంకల్పం ఉంటే అంత అసాధ్యమా?

అన్నప్రాశన రోజే ఆవకాయన్నమా అని అనుకునే పక్షంలో రెసిడెంట్ వెల్ఫేర్ సంఘాలు, బార్ అసోసియేషన్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, కాలేజీలు, యూనివర్సిటీల స్థాయిల్లో ప్రజలకి ఈ ప్రక్రియను అలవాటు చేయడానికి అభ్యంతరం ఏమిటి? కేవలం ఐదేళ్లకోసారి ఓట్ల పండగలా కాకుండా నిరంతర ప్రజాస్వామ్య ప్రక్రియలో మరింత బాధ్యతాయుతంగా పాల్గనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్ననాడే ప్రజలకొరకు, ప్రజల వలన, ప్రజల యొక్క అన్న ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఆచరణలో పెట్టినట్టవుతుంది.



ప్రజాస్వామ్యంలో ఉండాలి. కానీ ఈ దృష్ట్యా ప్రస్తుత పరిస్థితుల్లో కొలీజియం వ్యవస్థలో పెద్దగా మార్పులను ఎదురుచూడలేం. ప్రజాభిప్రాయానికి తగిన ప్రాముఖ్యాన్ని కల్పించగలరన్న నమ్మకాన్నయినా సుప్రీంకోర్టు ప్రజలలో కలిగించవలసిన అవసరం ఉంది. దీనికోసం అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిల్స్‌కి, బార్ అసోసియేషన్ అధ్యక్షులకి కొలీజియంలో తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం సముచితం. అంతేకాక, పారదర్శకంగా న్యాయపాలకుల నియామక ప్రక్రియ జరగవలసిన అవసరాన్ని గుర్తించి, ప్రతి నియామకానికి గల కారణాన్ని, న్యాయమూర్తి నియామకానికి కావలసిన కనీస అర్హతలు, నియామకానికి సంబంధించిన అంశాలు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు సిఫార్సు చేసిన వ్యక్తుల వివరాలు, నియామకానికి పరిశీలించిన వారి వివరాలు ప్రజలకి అందుబాటులో ఉండాలన్నటువంటి కేంద్రప్రభుత్వ సూచనలని సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకుంటుందని ఆశిద్దాం.

రాజ్యాంగం పరిధిలో పరిపాలనాధికారాన్ని నిర్వహించే రాజ్యాంగ వ్యవస్థల మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడైనా, రాజ్యాంగ మౌలిక స్వరూప రక్షణ కోసం, ప్రజలకి సరైన అవగాహన కల్పించి ప్రజాభిప్రాయం సేకరించగల అవకాశం

# మతపరమైన స్వేచ్ఛను కోరుతున్న భారత్

మతపరంగా స్వేచ్ఛ కావాలని మిగిలిన చాలా దేశాల ప్రజలకంటే ఎక్కువగా భారతీయులు కోరారు. ప్రపంచదేశాల్లో 74శాతం మంది మత స్వేచ్ఛను కోరుకుంటుంటే, భారత్‌లో ఆ శాతం 83. పురుషులకుండే హక్కులు మహిళలకూ ఉండాలని ప్రపంచవ్యాప్తంగా 65శాతం మంది కోరితే, భారత్‌లో 71 శాతం మంది డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన వార్తల్ని మీడియా ప్రచురించాలని భారత్‌లో 74శాతం మంది కోరారు. ఈ విషయంలో మిగిలిన దేశాలు ఇంకొంచెం ముందున్నాయి. ఓ అమెరికన్ అధ్యయన సంస్థ 38 దేశాలకు చెందిన 41,000 మంది నుంచి ఇందుకోసం అభిప్రాయాలు సేకరించింది.

## డిగ్రీ, ఆపై చదివింది 4.5శాతం మందే

దేశ జనాభాలో కేవలం 4.5 శాతం మందే డిగ్రీ లేదా ఆపై చదువులు పూర్తిచేశారు. జనాభాలో అత్యధికులు (32.6శాతం) ప్రాథమిక స్కూలు స్థాయి వరకైనా చదువు కోలేదు. అక్షరాస్యత, కార్మికులు, విద్యాస్థాయిలపై భారత రిజిస్ట్రార్ జనరల్, గణాంక కమిషనర్ విడుదల చేసిన 2011 జనగణన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఇందులో పేర్కొన్న మరిన్ని వివరాలు:

- 25.2 శాతం మంది ప్రాథమిక విద్య పూర్తి చేయగా, 15.7శాతం మంది మాధ్యమిక విద్య చదువుకున్నారు.
- 11.1శాతం మంది పదోతరగతి, 8.6శాతం మంది ఇంటర్ పూర్తి చేశారు
- 2001-11 దశకంలో మాధ్యమిక, ఆపై స్థాయిలు మెరుగుపడగా, ప్రాథమిక, అంతకన్నా తక్కువస్థాయిల్లో తగ్గుదల నమోదైంది
- వివిధ రకాల కార్మికులు, కార్మికేతరుల్లో అక్షరాస్యత, విద్యాస్థాయిలు మెరుగయ్యాయి. మొత్తం జనాభాలోను, ఎస్సీ,ఎస్టీల్లోనూ ఈ ధోరణి కనిపిస్తోంది.
- దేశంలో పని అందుబాటులో ఉన్న/కోరుకుంటున్న 5.55 కోట్ల మంది ఉపాంత కార్మికుల్లో.. 2.19 కోట్లమంది (39.4శాతం) అక్షరాస్యులు, 2.09 కోట్ల మంది (37.6శాతం) పది/ఇంటర్ కన్నా తక్కువ చదివినవారు, 80లక్షలమంది పది/ఇంటర్ దాటినా డిగ్రీ కన్నా తక్కువ చదివినవారు ఉన్నారు.
- పని అందుబాటులో గల/కోరుకుంటున్న 6.07 కోట్లమంది కార్మికేతరుల్లో పది/ఇంటర్‌లోపు చదివినవారు 31.1శాతం, నిరక్షరాస్యులు 17.2శాతం ఉన్నారు.
- మొత్తం 36.26 కోట్ల మంది ప్రధాన కార్మికుల్లో అక్షరాస్యులై పది/ఇంటర్‌లోపు చదివినవారు 13.2 కోట్ల మంది (35.9శాతం), నిరక్షరాస్యులు 10.43 కోట్ల మంది (28.8శాతం), పది/ఇంటర్ దాటి డిగ్రీలోపు చదువుకున్న వాళ్లు 7.15కోట్లు (19.7శాతం) ఉన్నారు.

# రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

## లోక్‌సత్తా రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందరావు

వర్షాభావ పరిస్థితుల వల్ల, వేసిన పంటలు చేతికొచ్చే పరిస్థితులు లేక తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సాతులూరి గోవిందరావు డిమాండ్ చేశారు. కోదాడలో అచ్చుతకుమార్ అధ్యక్షతన జరిగిన లోక్‌సత్తా పార్టీ పట్టణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరవు మండలాల్లో సహాయకచర్యలు అవినీతి లేకుండా జరిగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ స్థాయి పాలన చేయకుండా పాత పాలకుల్లాగే రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ ఫాంహౌజ్‌కే పరిమిత మైందన్నారు. తెలంగాణ వస్తే రైతులు పెరుగన్నం తిని అరుగుల మీద కూర్చుని కబుర్లు చెప్పుకోవచ్చని కేసీఆర్ చెప్పారని, ఇప్పుడు పురుగుల అన్నం తిని పాడె మీద పడుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఎన్నికల కోసం తప్ప కేసీఆర్ రాలేదన్నారు. రైతులకు మద్దతుగా, వ్యవసాయాన్ని లాభసాటి చేసే స్పష్టమైన విధానాలతో లోక్‌సత్తా ఆందోళనలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు



> కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ స్థాయి పాలన చేయకుండా పాత పాలకుల్లాగే రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ ఫాంహౌజ్‌కే పరిమిత మైందన్నారు. తెలంగాణ వస్తే రైతులు పెరుగన్నం తిని అరుగుల మీద కూర్చుని కబుర్లు చెప్పుకోవచ్చని కేసీఆర్ చెప్పారని, ఇప్పుడు పురుగుల అన్నం తిని పాడె మీద పడుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రావెళ్ల రవికుమార్, కె.రవి, వెంకటేశ్వర్లు, రామారావు, శ్రీను, మిట్టపల్లి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థి సత్తా ఏర్పాటుపై కమిటీ

లోక్‌సత్తా పార్టీకి అనుబంధంగా విద్యార్థి సత్తాను ఏర్పాటు చేయటానికి పెద్దగళ్ల రాజీవ్ చొరవతో వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 20మంది విద్యార్థి ప్రతినిధులు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. వివక్ష లేని సమాజం ఉంటేనే ప్రతి విద్యార్థికీ, విద్యార్థినికీ ఎదిగే అవకాశాలు లభిస్తాయని, అందుకు మంచి ప్రమాణాల విద్యను ఉచితంగా అందించటమే మార్గమని సమావేశం అభిప్రాయపడింది. ఆ లక్ష్యం కోసం పనిచేయటానికి అందరూ అంగీకరించారు. ఈ లక్ష్యాన్ని సాధించటానికి ఏళ్ల తరబడి బహుముఖ కృషి అవసరమని, ఇందుకు సంస్థాగత ఏర్పాట్లు, లక్ష్యాలు మొదలైనవాటిని చర్చించి ఒక సుస్థిర సంస్థగా రూపొందించడానికి 5గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీకి రాజీవ్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని, పవన్, ప్రద్యుమ్న, రాజు, సాయి, ప్రవీణ్ సభ్యులుగా ఉంటారని సమావేశానికి పరిశీలకునిగా వ్యవహరించిన లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేత పి. భాస్కరరావు తెలిపారు.

# రైతులకు ఆదాయ భద్రత కల్పించలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ విధానాలు
# ఎన్నికల మేనిఫెస్టో హామీల్నీ గాలికొదిలేస్తున్న రాజకీయ పార్టీలు

- డా॥ పి. భాస్కరరావు
స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య

***వ్యవసాయం అంటే పట్టణ ప్రాంత ప్రజలకు ఆహారం తయారుచేసి పెట్టే యంత్రం కాదు. ఆర్థిక నిపుణులు, అధికారులు, వ్యాపారులు, సామాజికవేత్తలు, రాజకీయ నాయకులు ఈ వాస్తవాన్ని గుర్తించటం లేదు. అందుకే రైతులు పెద్దఎత్తున పేదరికం వైపు మళ్లుతున్నా, తిరోగమనంలో పయనిస్తున్నా, ఆత్మహత్యకు పాల్పడుతున్నా మొక్కుబడి స్పందనలే తప్ప పెద్దగా వారికి పట్టదు. జాతీయ సంపద పంపకంలో అసమానతల వల్ల అభివృద్ధి సూచిక అస్తవ్యస్తంగా పయనిస్తోందన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. ప్రభుత్వమే ఆమోదించిన స్వామినాథన్ కమిషన్ కూడా తమను పట్టించుకునే వారే లేరనే భావన దేశవ్యాప్తంగా గ్రామాల్లోని రైతుల్లో ఉందని స్పష్టంగా చెప్పింది.***

ఇటీవల కొన్ని నెలలుగా తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న రైతుల ఆత్మత్యాగాలపై అధికారంలో ఉన్న పార్టీలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తీవ్ర విమర్శలు చేస్తూ, రైతుల సంక్షోభానికి రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయకపోవటమే కారణమన్నట్టు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు విమర్శిస్తున్న పార్టీలతో సహా గతంలో అధికారంలో ఉన్నవారు అనుసరించిన విధానాల వల్ల అప్పట్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది, అదే ఇప్పుడూ కొనసాగుతోంది అనే వాస్తవాన్ని మసిబూసి మారేడుకాయ చేస్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో దేశవ్యాప్తంగా రెండుసార్లు రైతులకు రుణమాఫీ పథకం అమలు జరిగినప్పటికీ గత 20 ఏళ్లలో సుమారు 3లక్షల 25వేల మంది రైతులు ఆత్మత్యాగం చేశారని,



అనేకమంది వ్యవసాయాన్ని వదిలిపెడుతున్నారని విస్మరిస్తున్నారు. రైతుల బీదరికాన్ని రుణమాఫీల ద్వారా, ఎక్స్‌గ్రేషియాల ద్వారా పరిష్కరించలేరని అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు ఇప్పటికైనా గమనించాలి. ఈ అంశాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకులు స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జరిపిన చైతన్య యాత్రల్లో పలుమార్లు వివరించారు. రైతులను జీవచ్ఛవాలుగా, ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూసే నేతలకు ఈ వాస్తవం ఇంకా చెవికెక్కలేదు. రైతులకు పంట ఉత్పత్తికయ్యే ఖర్చుకు అదనంగా 50శాతం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ పార్టీ, చంద్రబాబు పార్టీ ఇప్పుడు ఏరు దాటాక తెప్ప తగలేస్తున్నారు. దేశంలో 60శాతానికిపైగా ప్రజలకు జీవనోపాధిగా ఉన్న ఈరంగం గురించి ఎక్స్‌గ్రేషియాల ప్రకటనలు తప్ప రైతులకు ఆదాయాన్ని పెంచి, ఎదిగే అవకాశాల్ని కల్పిద్దామన్న ఆలోచననే కేంద్రం, తెలుగు రాష్ట్రాలు చేయటం లేదు. చివరికి హైకోర్టు కూడా లోక్‌సత్తా, స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య చెప్పిన మాటనే తాజాగా చెబుతూ, చచ్చాక పరిహారాల కంటే రైతులు బతికుండేందుకు చర్యలు తీసుకోండని మొట్టికాయలు కూడా వేసింది.


రైతుల బీదరికానికి, ఆత్మహత్యలకు మూలాలను తెలుసుకోకుండా తాత్కాలిక పరిష్కారాలు కోరటం సమస్యకు పరిష్కారం కాదు. జీవన వ్యయం పెరిగినా రైతు ఆదాయం పెరగలేదు. కుటుంబాలు చిన్నవై, కష్టసుఖాలు పంచుకునేవారు లేక నిర్వేదంలోకి వెళుతున్నారు. ఫలితంగా మానసిక సంక్షోభానికి గురై ఎవరికీ చెప్పుకోలేక, పరిష్కారం తెలీక కొందరు దుర్బలత్వంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశానికి అన్నం పెట్టే వృత్తిలో మెజారిటీ ప్రజలు ఉన్న దేశంలో ఇలాంటి దుస్థితి దురదృష్టకరం.

అనావృష్టిని ఎదుర్కోవటం రైతుకి కొత్తేమీ కాదు. సమయానికి అనుగుణంగా పంటలు వేసుకునేవారు. పురుగు మందులు, ఎరువుల కోసం లక్షలు పోసి వాణిజ్య పంటలు పండించేవారు కాదు. ఉత్పాదక వ్యయం గణనీయంగా తక్కువగా ఉండేది. ఒక ఏడాది కరవు వచ్చినా దిగుబడి సరిగా రాకపోయినా ఆర్థికంగా నష్టపోయేవారు కాదు. పంటపండని ఏడాది పశుపోషణతో, అనుబంధ వ్యవసాయంతో నిలదొక్కుకునేవారు. ఇప్పుడు తీరు మారింది. ఎంత ఖర్చు చేస్తే అంత దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. ఎరువులూ, పురుగు మందులూ అపరిమితంగా వినియోగిస్తూ పెట్టుబడులు అధికంగా పెడుతూ దానికి తగ్గట్టు ఆదాయం రాక సంక్షోభంలో పడుతున్నారు.

శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాతో వర్షపాతానికి, భూములకు అనువైన పంటలు వేసుకుంటే రైతు కనీసం మనుగడ సాగించగలుగుతాడు. ప్రభుత్వపరంగా వ్యవసాయ విస్తరణ బలోపేతం కావాలి. వర్షాధార పంటలు సాగుచేసే రైతుల కోసం

ఎన్నో ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. చిన్న రైతుకి మేలు చేసే వ్యవస్థలన్నింటినీ ఒక్కతాటి మీదకు తీసుకురావాలి. రుణాలు, విత్తనాలు, ఎరువుల కోసం రైతులు వీధి పోరాటాలు చేస్తుంటే, రాజకీయ ఎరలలో చిక్కుకుంటుంటే వ్యవసాయం లాభసాటి ఎలా అవుతుంది? ప్రభుత్వ పథకాలను సమన్వయం చేసి గ్రామస్థాయికి చేర్చే వ్యవస్థ ఏర్పడాలి. తనని వెన్నంటి నడిపించే, వేధించకుండా అవసరమైన సాయం అందించే యంత్రాంగం ఉందని రైతుకి భరోసా ఉంటే, ఒక ఏడాది వ్యవసాయం దెబ్బతిన్నా, వచ్చే ఏడాది కోలుకోగలనని ఆశతో ఉంటాడు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రయోజనాన్ని స్పష్టంగా రైతులకి వివరిస్తే తప్పక ముందడుగు వేస్తారు. ఎక్కడ ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరిస్తున్నారో, ఎంత ప్రయోజనం పొందుతున్నారో రైతుకి తెలియచేయాలి.

ప్రపంచ జనాభాలో 17శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్, కేవలం 2.4 శాతం భౌగోళిక విస్తీర్ణం, 4శాతం జలవనరులతో ఆహార భద్రత సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేసి తీరాలి. ఇప్పటికే రోజూ దాదాపు 2,000 మంది రైతులు కాడిమేడి వదిలేస్తున్న దశలో అసంబద్ధ మద్దతు ధరల విధానాలకు చరమగీతం పాడాలి. సహేతుక గిట్టుబాటు ధర కల్పిస్తే రాయితీలు, రుణమాఫీల కోసం దేబిరించకుండానే మెరుగైన దిగుబడులు సాధించగల రైతుబిడ్డలు మనకున్నారు. రైతు ఎదగటానికి కాకుండా, కేవలం బతకటానికి దోహదం చేసే ఈ కనీస స్థాయి ఏర్పాటులో కూడా ఓటుబ్యాంకు రాజకీయాలు, అబద్ధపు మేనిఫెస్టోలు. దేశంలో 60శాతం మంది రైతులు రైతు కూలీలుగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం ఎదుగూ బొదుగూ లేకుండా అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి చందాన ఉంది. నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుమందులు రాజ్యమేలుతున్నాయి. బ్యాంకు రుణాలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకందటం లేదు. మార్కెట్లో మోసాలు, దళారీలు రైతులకు పెనుశాపంగా మారారు. వ్యవసాయరంగంలో ఉన్నవారికి, వ్యవసాయేతర రంగంలో ఉన్నవారికి మధ్య ఆదాయంలో అంతరం బాగా పెరిగిపోతోంది. ఈ అసమానతల్ని ఎంతోకాలం విస్మరించటమంటే, ఆర్థిక, సామాజిక, రాజకీయ అస్థిరత్వాన్ని కొనితెచ్చుకోవటమే. వ్యవసాయ అభివృద్ధి వేగంగా సాగటం, గ్రామీణ ప్రాంత ప్రజల సంక్షేమం పెరుగుపడటం కీలకం. వ్యవసాయ ఉత్పత్తిని టన్నులకు టన్నులు పెంచటం కాదు. గ్రామీణుల ఆదాయం పెంచటం ముఖ్యం. వ్యవసాయం ఆర్థికంగా అత్యంత శ్రమతో, పెట్టుబడితో, రిస్కుతో కూడిన కార్యక్రమం. వ్యవసాయం అంటే పట్టణ ప్రాంత ప్రజలకు ఆహారం తయారుచేసి పెట్టే యంత్రం కాదు. ఆర్థిక నిపుణులు, అధికారులు, వ్యాపారులు, సామాజికవేత్తలు, రాజకీయ నాయకులు ఈ వాస్తవాన్ని గుర్తించటం లేదు. అందుకే రైతులు పెద్దఎత్తున పేదరికం వైపు మళ్లుతున్నా, తిరోగమనంలో పయనిస్తున్నా, ఆత్మహత్యకు పాల్పడుతున్నా మొక్కుబడి స్పందనలే తప్ప పెద్దగా వారికి పట్టదు. జాతీయ సంపద పంపకంలో అసమానతల వల్ల అభివృద్ధి సూచిక అస్తవ్యస్తంగా పయనిస్తోందన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. ప్రభుత్వమే ఆమోదించిన స్వామినాథన్ కమిషన్ కూడా తమను పట్టించుకునే వారే లేరనే భావన దేశవ్యాప్తంగా గ్రామాల్లోని రైతుల్లో ఉందని స్పష్టంగా చెప్పింది.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతులను సంకెళ్లతో బందీలుగా చేశాయి. వ్యవసాయరంగంలో ప్రభుత్వాలు పురాతన కాలంనాటి విధానాలు కొనసాగిస్తున్నాయి. అవినీతి, అనాలోచిత నిర్ణయాలు వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. వ్యవసాయంలో ఉత్పత్తి.. వాతావరణ పరిస్థితుల మీద, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, తెగుళ్ల నివారణ మందులు, సకాలంలో ఆర్థిక సహకారం, అదునులో కూలీలు అందుబాటులో ఉండటం మీద ఆధారపడి ఉంది. ఏ ఒక్క పంట పోయినా రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. కానీ ప్రభుత్వాల విధానాలు ఎంత దారుణంగా ఉన్నాయంటే, అన్ని ఆటంకాల్ని, వాతావరణ వైపరీత్యాల్ని దాటుకుని మంచి పంట పండిస్తే సరైన ధరలు కూడా లభించకుండా దెబ్బతీస్తున్నారు. పంట విఫలమైతే రైతు సర్వం కోల్పోతున్నాడు. ఇలా పంటలు బాగా పండినా, పండకపోయినా రైతులు నష్టపోతున్నారు.

దేశ జనాభాలో సుమారు 60శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన జాతీయ వ్యవసాయ విధానం లేక నష్టపరుస్తున్నారు. దేశంలో వ్యవసాయం మీద ఆధారపడిన రైతులు/కౌలుదారుల తలసరి ఆదాయం ఏడాదికి సుమారు రూ. 20,000 కాగా, వ్యవసాయేతర రంగాలలో ఉన్న వ్యాపారులు, ఉద్యోగులు, సేవారంగంలో ఉన్నవారు, వృత్తినిపుణులు, పారిశ్రామికవేత్తల తలసరి ఆదాయం రూ. 1,15,000గా ఉంది. మూడింట రెండువంతుల జనాభా తమ ఆదాయం ద్వారా కనీస అవసరాల స్థాయిని దాటి జీవించలేకపోతుండటం వల్ల, పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువుల్ని కొనలేకపోతున్నారు. మరి, వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతుంటే పారిశ్రామిక, సేవారంగాలు ఎలా అభివృద్ధి చెందుతాయి? ఇది ప్రకృతి శాపం కాదు, పాలకుల పాపం.

సౌకర్యాలు, విలాసాల మాట అలా ఉంచి, కనీసం రెండు పూటలా పుష్టికరమైన భోజనం కూడా వ్యవసాయదారునికి గ్యారంటీ లేకపోవటం వల్లే, పల్లె ప్రాంతంలోని ఏ రైతూ తన కూతుర్ని మరో రైతుకి ఇచ్చి పెళ్లి చేయటానికి లేదా తన కొడుకుని వ్యవసాయ వృత్తిలోకి తీసుకురావటానికి ఇష్టపడటం లేదు. వ్యవసాయేతర రంగాలలో ఉపాధి సృష్టి, నైపుణ్యాలు కొరవడటం వీరి పరిస్థితిని మరింత దయనీయంగా మారుస్తోంది.

భారతీయ రైతు వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరకు పండించటం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో మంచి లాభాలను ఆర్జించవచ్చని చెబుతూ ప్రపంచ వాణిజ్య సంస్థలో భారత్ చేరటాన్ని డా॥ మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ ఆనాడు మంత్రులుగా పార్లమెంటు సాక్షిగా సమర్థించారు. బియ్యం ఉత్పత్తిలో మనం చాలా లాభదాయక స్థితిలో ఉన్నా ఎగుమతులను అనుమతించకుండా, అంతర్జాతీయ మార్కెట్లో అధిక ధరల ద్వారా మన రైతులు లాభపడకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల విషయంలో సమగ్రమైన విధానం లేక వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని నష్టపోతున్నాం. అలాగే వంటనూనెలు, పప్పులు దిగుమతుల కోసం సంవత్సరానికి రూ.50వేల కోట్లకు పైగా విదేశీ మారక ద్రవ్యాన్ని చెల్లిస్తున్నాం. సమగ్రమైన ప్రణాళికతో నూనె గింజల మిషన్ అమలు చేసి ఉంటే, నూనెలు దిగుమతి చేసుకునే అవసరం ఉండేది కాదు. కానీ ఈరోజు విచిత్రమైన పరిస్థితి. ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాల్లో పామ్ ఆయిల్ పంట లాభసాటికాక పామ్ ఆయిల్ తోటల్ని రైతులు తొలగిస్తున్న దుస్థితి. వేల కోట్లు వంటనూనెల దిగుమతికి ఖర్చు చేస్తూ, వాటిపై దిగుమతి సుంకం వేసి వచ్చిన ఆదాయంతో మనదేశంలోని పామాయిల్ రైతులకు సబ్సిడీలు ఇచ్చి లాభసాటి చేయలేని పనికిమాలిన వ్యవసాయ విధానం మనది.

మన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు వాళ్ల జీతభత్యాలు, అలవెన్సులు, వసతులు వాళ్లే నిర్ణయించుకుంటారు. పారిశ్రామికవేత్తలు వాళ్ల ఉత్పత్తులకు వాళ్లే ధరలు నిర్ణయించుకుంటారు. డాక్టర్లు, లాయర్లు, సేవారంగంలో ఉన్నవారు వాళ్లకి సంబంధించిన ఫీజులు వాళ్లే నిర్ణయించుకుంటారు. వ్యాపారస్తులు, దళారులు వాళ్ల ఫీజులు, లాభాల శాతాన్ని వాళ్లే తేల్చిచెబుతారు. ప్రభుత్వోద్యోగులు, కార్మికులు, సంఘటితరంగంలో ఉన్నవారు తమకు జీతభత్యాలు, అలవెన్సులు, సౌకర్యాలు ఎంత కావాలో అంత డిమాండ్ల ద్వారా, సమ్మెల ద్వారా సాధించుకుంటారు. కానీ రైతులు/కౌలుదారులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు ధరల్ని నిర్ణయించుకోలేరు, దళారులు, వ్యాపారులు నిర్ణయిస్తారు. రైతులకిచ్చే రాయితీలకన్నా విధానాల ద్వారా వారికి కలిగిస్తున్న ఆర్థిక నష్టం చాలా ఎక్కువ. మరి దేశానికి ఆహార భద్రత కల్పించిన రైతులకు రైతే రాజు, అన్నదాత, దేశానికి వెన్నెముక వంటి పైపై బిరుదుల తప్ప ఈ దేశం ఏమిస్తున్నట్టు?

## వ్యవసాయ రంగ సంక్షోభం - తక్షణ కీలక పరిష్కారాలు

1. రైతులకు నాణ్యమైన విద్యుత్తు: వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను వేరు చేసి వోల్టేజీ హెచ్చుతగ్గులు లేని నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా, వృధాను అరికట్టేలా మీటర్లతో సరఫరా చేయాలి

2. ఆగ్రి క్లినిక్‌లు: అగ్రి క్లినిక్‌ల ద్వారా రైతులందరికీ సరసరమైన ధరలకే నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు అందించాలి బి) వ్యవసాయ ఉత్పత్తులను లాభసాటి ధరకు అమ్ముకునేందుకు సలహాలు, తాజా సమాచారం సి) వ్యవసాయ సమస్యలపై 24 గంటలలోగా సాంకేతికపరమైన సహాయం. ఉచిత భూసార పరీక్షలు జరిపి రైతులకు రిపోర్టులిచ్చే ఏర్పాటు డి) ఉచితంగా పశు వైద్య సేవలు

3. బ్యాంకు రుణాలు: ప్రతి రైతుకీ భూమి మార్కెట్ విలువను బట్టి రుణసౌకర్యాన్ని కల్పించాలి. వ్యవసాయ పెట్టుబడి, కుటుంబ అవసరాల కోసం రైతు ఎప్పుడు కావాలంటే అప్పుడు రుణం పొందే ఓవర్ డ్రాఫ్ట పద్ధతి బి) కౌలుదారులనూ రైతులుగానే గుర్తించి పంటరుణాల కోసం క్రెడిట్ కార్డులు

4. వ్యవసాయ మార్కెట్లు: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రైతుల కమిటీ చేతుల్లో మార్కెట్ యార్డుల యాజమాన్యం బి) మార్కెట్ యార్డుల్లో అవినీతి, అక్రమాలు లేకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి సి) రైతు ఉత్పత్తులను ప్రత్యక్షంగా అమ్ముకునేందుకు రిటైల్ మార్కెట్ చైన్‌లతో అనుసంధానం. ఉత్పత్తుల నిల్వకు గోడౌన్‌లు, పంటలపై ప్లెడ్జి రుణాలు. పండ్లు, కూరగాయలు నిల్వ చేసుకుని మంచి ధర పొందటానికి శీతల గిడ్డంగులు, రేడియేషన్ సెంటర్లు

5. ఆగ్రో పరిశ్రమలు: రైతుల పంట విలువలను పెంచే ఆగ్రో పరిశ్రమల ఏర్పాటు. గ్రేడింగ్, ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్టు, మార్కెటింగ్ రంగాలలో రైతుల పిల్లలకు శిక్షణ

6. ఎగుమతులు దిగుమతులు: వ్యవసాయ రంగంలో ఉత్పత్తులను ఎక్కడ లాభసాటి ధర లభిస్తే అక్కడ అమ్ముకునే స్వేచ్ఛ. విదేశాలకు ఎగుమతికి ఎటువంటి ఆటంకాలు లేకుండా, ఉన్న ఆంక్షలను తొలగించాలి.

7. నీటిపారుదల: సమగ్రమైన నీటి వినియోగ ప్రణాళికతో అన్ని ప్రాంతాలకూ మేలు చేకూర్చే సాగునీటి విధానం

8. ఉపాధి హామీ పథకం: జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి 50శాతం నిధుల్ని వ్యవసాయానికి కేటాయించాలి. తద్వారా రైతుకి సాగు ఖర్చు తగ్గుతుంది.

9. విత్తన చట్టం: బహుళ జాతి కంపెనీల ద్వారా ఉత్పత్తి చేయబడిన విత్తనాలను సరమైన ధరలకు రైతులకు లభించే ఏర్పాటు

10. నాణ్యమైన విద్య, ఆరోగ్యం: రైతు బిడ్డలకు నాణ్యమైన విద్యను, కుటుంబాలకు మంచి ప్రమాణాల ఆరోగ్యాన్నీ అందుబాటులో అందించాలి. ఈ రంగాలలో ప్రభుత్వాల వైఫల్యం వల్ల మితిమీరిన ఆర్థికభారంతో రైతులు కుంగిపోతున్నారు.

11. అవినీతి లేని సేవలకు సర్వీస్ గ్యారంటీ: ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి వల్ల రైతులు పెద్దఎత్తున నష్టపోతున్నారు. అందుకే నిర్ణీత కాలవ్యవధిలో సేవల్ని అందించేలా, ఆలస్యమైతే రోజుకు కనీసం రూ.250 నష్టపరిహారం చెల్లించేలా కనీసం రైతులకు సంబంధించినంత అంశాల మేరకైనా సర్వీస్ గ్యారంటీకి సిటిజన్ ఛార్టర్లను అమలు చేయాలి. ⌖

# స్వచ్ఛభారత్ తొలి అడుగు ఎప్పుడు?

- ఎ. అన్నపూర్ణ




అమెరికాలో ఉన్నప్పుడు గత ఏడాది అక్టోబర్ 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన 'స్వచ్ఛభారత్' గురించి విన్నాను. పత్రికల్లో చదివాను. ప్రముఖులు (బహుముఖులు)తో కలిసి ప్రజలు చేసిన కార్యక్రమాల ఫోటోలు, వీడియోల వెల్లువ చూసి భారతదేశంలో చక్కగా చెత్త ప్రక్షాళన ప్రారంభమైందని సంతోషించాను. ప్రధాని అయితే గుజరాత్ ముఖ్యమంత్రిగా అక్కడ అమలు చేశారో లేదో నాకు తెలియదుగానీ, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఎన్నికల ఎజెండాలోనే పరిసరాల పరిశుభ్రత, ప్రక్షాళన గురించి వివరించారు. తన కార్యకర్తలతో కలిసి ప్రజల్లోకి వెళ్లి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్లాస్టిక్ వాడకం మానాలని, మరుగుదొడ్లు నిర్మించాలని ఎంతగానో చెబుతూ వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కన్నా పారిశుధ్యం, కలుషితంకాని మంచినీరు, ఆహ్లాదకర పర్యావరణం అందించే పార్కులు, ఆటస్థలాలు వంటివి అందించే స్థానిక ప్రభుత్వాలు ప్రజల రోజువారీ జీవితంలో ముఖ్యమని జేపీ ఎన్నిసార్లు చెప్పారో లెక్కలేదు. గాంధీజీ ఆశించిన నిజమైన స్వచ్ఛభారత్ సాకారం కావాలంటే స్వచ్ఛ రాజకీయాల వరకూ ఎన్నో జరగాల్సి ఉన్నా, కనీసం పారిశుధ్యం అనే తొలి అడుగు పడుతుందని నాలాంటి పలువురు లోక్‌సత్తా వాదులు ఆశపడ్డారు. కానీ ఆ తొలిఅడుగు నెరవేరటానికి కావలసిన – స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించటం, తలసరి రూ. 1000–2000 వార్డు స్థాయి వరకూ కేటాయించటం వంటి చర్యల్ని ప్రభుత్వం చేపట్టకపోవటం వల్ల స్వచ్ఛభారత్ కేవలం ప్రచార ఆర్భాటం స్థాయిలోనే మిగిలివుంది. తాజా స్వచ్ఛభారత్ సెస్సు కూడా మరో బాదుడుగానే తయారై ఏటా రూ. 10,000 కోట్లు పందేరాలు, ప్రచారాలతో పక్కదోవ పట్టే పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక సాధికారత, ఎక్కడికక్కడ ప్రజల చేతికి అధికారం కోసం రాజకీయ పోరాటం చేస్తూనే, ప్రజల్లో పరిశుభ్రత పట్ల చైతన్యం కలిగించేందుకు వ్యక్తిగతంగా కూడా అందరం ప్రయత్నించాలి. రాజకీయ మార్పు రావటానికి ప్రజల్లో సామాజిక చైతన్యం కలిగించే కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు సంఘసంస్కర్తల జీవితాలు మనకు బోధిస్తున్నాయి. అందుకేనేమో గాంధీజీ ఓపక్క రాజకీయ పోరాటం చేస్తూనే మరోపక్క సామాజిక సంస్కరణ కార్యక్రమాలను కూడా కొనసాగించారు. అటువంటి

సంఘసంస్కరణ కార్యక్రమాలు బలహీనంగా ఉండటం వల్లే లోక్‌సత్తా వంటి కొత్త రాజకీయ భావజలం వేళ్లూనుకోవటానికి సమయం పడుతోంది.

వ్యక్తిగతంగా ఎవరికివారు తమ పరిసరాలను బాగు చేసుకోగలిగితే, ఆ స్ఫూర్తితో మిగిలినవారు ముందడుగు వేస్తుంటారు. రాజకీయ విధానం తెచ్చిన స్థాయిలో కాకపోయినా క్రమంగా పరిశుభ్రత ఒక సంస్కృతిగా వేళ్లూనుకోవటం ఖచ్చితంగా మొదలవుతుంది. దీనికి ఉదాహరణగా 5 సంవత్సరాల నాటి కొన్ని సాధారణ సంఘటనలు చెబుతాను. నేను నివాసముండే శ్రీనగర్ కాలనీలో పోస్టాఫీసు మీదుగా రోజూ వాకింగ్ చేసే దాన్ని. ఒకరోజు ఆ దారిలో రోడ్డు మీద ఉన్న ఒక పెద్ద గుంతలో అడుగుపడి కాలు స్లిప్పయింది. 'ఈరోజు నాకు ఇబ్బంది కలిగింది, రేపు మరొకరికి కూడా ఈరకమైన బాధ కలగవచ్చు. లేదా ఏ బైక్ అయినా పడిపోవచ్చు కనుక ఇప్పుడే దీన్ని పూడ్చాలి' అనుకున్నాను. అనుకున్నదే తడవుగా రోడ్డు చివరగా ఉన్న చిన్నచిన్న రాళ్లని, మట్టిని తెచ్చి ఆ గుంతను చదును చేయడం మొదలుపెట్టాను. నన్ను చూసి ఆ దారిలో వెళ్లే యువకులు ఇద్దరు నాతోపాటు ఆ పని చేయడానికి సహాయం చేశారు. ఆ పని నాకు ఎంతో ఆనందం కలిగించింది. ఆ యువకులు కూడా 'మేడమ్! ఇక నుంచీ ఎక్కడైనా రోడ్డు మీద దారిలో గుంతలు కనిపిస్తే ఇలాగే చదును చేస్తాం. మా బాధ్యతను తెలియచేసినందుకు థాంక్స్' అన్నారు. వారి మాటలు మరింత ఆనందం కలిగించాయి.

ఆరోజు ఆదివారం. నేను వాకింగ్‌కి బయలుదేరాను. రోడ్డు మీదకి వచ్చేసరికి పేపర్లు వేసే అతను వాటి బరువును బ్యాలెన్స్ చేసుకోలేక సైకిల్‌తో పాటు పడిపోయాడు. కాసేపు ఆగాను. దారిన పోయేవారు అతనికి సాయం చేస్తారేమోనని! ఎవ్వరూ ఆగలేదు. చెల్లాచెదురవుతున్న పేపర్ల మీదగా కూడా కొందరు వెళ్లారు. నేను వెళ్లి పేపర్లు ఏరి అతనికి ఇవ్వసాగాను. అప్పుడు వచ్చారండీ జనాలు. నామోషీ ఫీలవకుండా, నాకెందుకు అనుకోకుండా మంచి పని చేయాలనే ఆలోచనే స్వచ్ఛభారత్‌కు ఇంధనం గదా!

ప్రధాని మాటలు చేతలు ప్రజలలో చైతన్యం నింపుతాయి, సందేహం లేదు, కాస్త రోడ్లు నీట్‌గా ఉంటాయి, గుంతలుండవ్, చెత్తకుప్పల దుర్వాసన ఉండదు అనుకుంటూ మనదేశానికి వచ్చిన నాకు ఎక్కడా ఆ జాడ కనిపించలేదు. నేను విదేశానికి వెళ్లే ముందు ఎలా ఉందో ఇప్పుడూ అంతే! యధాతధం. కొంతలో కొంత మంచిపని ఏమిటంటే, మూవీ స్టార్స్, ఒక క్రికెటర్ గ్రామాలను దత్తత తీసుకోవటం. వీటికి కారణాలు, పేర్లు ఏవైనా కావచ్చు. గ్రామాలు బాగుపడి కళకళలాడటానికి ఇదో అవకాశం. ఆ తారల పేరుప్రఖ్యాతులు కూడా ఇనుమడిస్తాయి. వ్యక్తిగతంగానూ వారికి సంతోషం కలుగుతుంది. ఆ దేశంలో అలా.. ఈ దేశంలో ఇలా అని పోల్చుకుని నిట్టూర్చే, తిట్టిపోసే పరిస్థితి రాకుండా వ్యక్తిగతంగా మనం ఏదో చేయాలి అనే తపన ప్రతివారిలోనూ ఉన్న రోజే మనదేశం బాగుపడుతుంది. మేముండే అపార్ట్‌మెంట్స్‌లో వాళ్లం ధనవంతులం కాదు. అంతా మధ్యతరగతి వాళ్లమే. పెద్దపెద్ద డ్రమ్ములు నాలుగు మా ఆవరణ వెనకభాగంలో ఉంచి చెత్తను నాలుగు రకాలుగా విడివిడిగా ఆ డబ్బాల్లో వేస్తాం. చెత్త అంటే ఇల్లు రిపేర్ చేసుకున్న రాళ్లు, సిమెంట్, మట్టి, పనికిరాని చెక్క సామాను, పింగాణీవి ఇలా ఏవేవో ఉంటాయి. ఈ రకమైన చెత్తను నింపేవారు కొంత డబ్బును చెల్లించాల్సి ఉంటుంది. ఈ కారణంగా ఎక్కువ చెత్త చేరనీయకుండా చేయవచ్చు. ఇష్టం వచ్చినట్టు రోడ్డు మీద పడేయకుండా నియంత్రించగలుగుతాం. జేపీగారు విస్తృతంగా ప్రచారం చేసిన ఇంకుడుగుంతలు కూడా మొట్టమొదట మా అపార్ట్‌మెంట్‌లోనే తయారుచేసుకున్నాం. మా అసోసియేషన్ చాలా నియమబద్ధంగా పనిచేస్తుంది. అందరమూ సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుంటాం. ఇంకొకర్ని తప్పుపట్టకుండా మనం చేసి చూపిస్తే ప్రజల్లో తప్పక మార్పు మొదలవుతుంది. ఈ ఆలోచనతోనే ప్రధాని స్వయంగా గాంధీమార్గంలో చీపురు చేతబట్టి నడుం వంచి పనిచేసి చూపించారు. ఇప్పటివారికి గాంధీ ఎవరో, ఆయన సిద్ధాంతాలు ఏమిటో అవెంతవరకు ఆచరణసాధ్యమో తెలియకపోవచ్చు. అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ పేరు విన్నారేమోగానీ ఆ అమరజీవి గురించి తెలియకపోయినా ఆశ్చర్యం లేదు. ఇప్పటి రాజకీయ ప్రముఖులకే గాంధీని

తల్చుకోవడానికి టైమ్ లేదు. ఇక పిల్లలకేమి చెబుతారు? కరెన్సీ నోట్ల మీదనైనా గాంధీజీ బొమ్మను చూసినవారెవరు? ఎక్కువమంది అంకెనే చూస్తారు. దానికి విలువ ఉందా, ఎంత అన్నదే చూస్తారంతే!

స్వచ్ఛత అనేది మనసులో నుంచి రావాలి లేదా ఎవరైనా చెబితే ఆచరించాలి. కనీసం పాటించేవారి వెంట నడవాలి. అది తాత్కాలికం కాకూడదు. ఆరంభించి అక్కడితే విడిచిపెట్టకూడదు. కొనసాగించినప్పుడే స్వచ్ఛత సాధ్యం. ప్రభుత్వం చాలాకాలం క్రితం ప్లాస్టిక్ వాడకం మానుకోవాలని ప్రజలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించింది. వాటికి తగిన ప్రత్యామ్నాయం లభించక దారుణంగా ఆ కార్యక్రమం విఫలమైంది. అయితే కొందరు సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించి, బదులుగా క్లాత్, పేపర్, నారతో చేసిన బ్యాగ్‌లను తయారుచేసుకుని వాడుకుంటున్నారు. ప్రజలలో కొంత చైతన్యం వచ్చినప్పుడు వాటిని కొనసాగించేందుకు కావలసిన వ్యవస్థలను కూడా క్రమంగా నిర్మించుకునే దిశగా చొరవ తీసుకోవటం కూడా మొదలైతే మార్పు పటిష్టమవుతుంది. క్రమంగా వ్యవస్థలా తయారవుతుంది. రోజువారీ జీవితంలో భాగమవుతుంది. ఈమధ్య ఒక కార్యక్రమంలో సాక్షాత్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌తో ప్రధాని మోదీకి పట్టుశాలువాను బహూకరించడం ప్రత్యక్షంగా చూశాక మతిపోయింది. ఆచరణలో పెట్టాల్సింది ప్రజలు మాత్రమే పాలకులు కాదని ఆ దృశ్యాన్ని బట్టి అనుకోవాలా? ఏమనుకోవాలి! ప్రతి విషయాన్నీ పాలకులు పట్టించుకోలేరని సరిపెట్టుకుందామన్నా, స్వచ్ఛభారత్‌ను ఒక ఉద్యమంలా నిర్వహించాలని పిలుపునిచ్చి ఏదోకరకంగా ప్రజల్ని కదిలిస్తున్న వ్యక్తికే ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌తో బహుమానం ఇవ్వడం చాలా బాధ్యతారహితంగా ఉంది. ఇంకెక్కడి స్వచ్ఛత? స్వచ్ఛభారత్ సీఎంల ఉపసంఘానికి నేతృత్వం వహిస్తున్న ఆ ముఖ్యమంత్రి ఇచ్చే సిఫార్సుల్లో ఎంత చిత్తశుద్ధి ఉంటుంది?

మనం పోగుచేస్తున్న చెత్త నుంచే జబ్బులు వస్తాయని తెలిసి కూడా నిర్లక్ష్యం వహించటం, మన ఇంట్లో చెత్తను పక్క ఇంట్లోనో, రోడ్ల మీదో పోయటం, ఆ తర్వాత ఎవరినో బాధ్యుల్ని చేయటం అలవాటు నుంచి మనం బైటపడాలి. చెత్తను బైట వేయవద్దు, నిర్దేశించిన తొట్టెల్లో వేయమంటే, టీవీ సీరియల్ ఎపిసోడ్ నెంబర్ పట్ల చూపిన శ్రద్ధను కూడా కనబర్చకపోతే మనకు మనమే నష్టంచేసుకున్నవారమవుతాం. చైన్ స్నాచింగ్ దొంగలు పేట్రేగిపోతున్నారంటే పూర్తిగా పోలీసు వ్యవస్థనే నిందించలేం. బంగారం మీద వ్యామోహం తగ్గించుకోవటం, అలంకరణల్ని, ఆడంబరాల్ని నియంత్రించుకోవటం మనబాధ్యత కూడా.

అలాగే వివక్షలు, విద్వేషాలు వంటి అపరిశుభ్ర ఆలోచనలు రానీయకుండా మనసును స్వచ్ఛంగా ఉంచుకోవాలి. ఒకవేళ వచ్చినా వాటిని ప్రక్షాళన చేసుకునే రీతిలో మంచి ఆలోచనలు, భావాలు మనకు కలిగే వాతావరణాన్ని మన చుట్టూ నిర్మించుకోవాలి. మంచి సమాజం, అందుకోసం మంచి రాజకీయం నిర్మించుకోవటమనేది మనకు మనం చేసుకునే మేలే తప్ప ఇతరుల కోసం కాదు. ఇలాంటి ఆలోచనల్ని, అలవాట్లని చిన్నతనం నుంచే పెద్దలు నేర్పాలి. 'నీ బుక్‌రాక్ నువ్వే నీట్‌గా సర్దుకో, నోట్సులు నీట్‌గా రాసుకో, నువ్వు వాడే దుస్తులు, వస్తువులు జాగ్రత్త చేసుకునే బాధ్యత నీదే' అనే సూత్రాన్ని తెలియచేస్తే క్రమంగా స్వచ్ఛత అలవాటవుతుంది. ఏదైనా అలవాటు అభ్యాసం నుంచే రావాలి. ఒకరిమీద ఆధారపడేలా ప్రజల్ని తయారుచేసే విధానాలను రాజకీయ నాయకులు అమలు చేయటానికి కారణం – తాము దోపిడీ చేస్తూ కూడా ఓట్లు దండుకోవటవటానికి వీలుగా ఉంటుంది కాబట్టి. ఆ ఉచ్చులో పడకుండా మన కాళ్ల మీద మనం నిలబడే స్వతంత్ర, నాగరిక జీవన ధోరణి కావాలి. ఎవరో చేస్తారనే నిర్లక్ష్యం సరికాదు. ఈరోజుల్లో తల్లిదండ్రులు పిల్లలకు అన్నీ అమర్చుతున్నారు. అంతదాకా బాగానే ఉందిగానీ, ఆ తర్వాత పిల్లలకు వాటిని తీర్చిదిద్దుకునే బాధ్యతను నేర్పడం లేదు. స్వచ్ఛభారత్ వంటి వాటికి వేలకోట్లు ప్రచారఖర్చవుతున్నా పెద్దగా ఫలితాలు రాకపోవటానికి పెంపకం, విద్యావ్యవస్థలోని లోపాలు కూడా కారణాలు. ప్రభుత్వం ప్రముఖ వ్యక్తులను అంబాసిడర్లుగా చేసి ప్రజలలో చైతన్యం తీసుకురావాలనే ప్రయత్నం చేయడం హర్షణీయం. అయితే వాళ్లు రోజూ వచ్చి ప్రజల మధ్యకు వచ్చి వీధులు శుభ్రం చేయరుగదా. అందుకే స్వచ్ఛభారత్‌ను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవటంతోపాటు అది ఆచరణాత్మకం కావటానికి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసుకోవటం వంటి చర్యల కోసం కూడా పట్టుపట్టాలి. అప్పుడే స్వచ్ఛభారత్‌కు తొలిఅడుగు పడుతుంది. లక్ష్యం దిశగా చకచకా అడుగులు వేయగలుగుతుంది.

# చెలరేగుతున్న మాఫియాను అడ్డుకోవాలి మేయర్ దంపతుల హత్య అనాగరికం: సురేంద్ర శ్రీవాస్తవ

దేశంలో, రాష్ట్రంలో సహజ సంపదలను కొల్లగొట్టటానికి మాఫియా గ్యాంగ్‌లు చెలరేగిపోతున్నాయని, వీటిని అరికట్టటానికి చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సురేంద్ర శ్రీవాస్తవ హెచ్చరించారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, చిత్తూరు నగర మేయర్ దంపతుల దారుణహత్య పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. హత్యా రాజకీయాలను అన్ని పార్టీలూ తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ఇసుక కుంభకోణంలో కీలక పాత్ర పోషిస్తున్న కిరాయి గూండాలు ప్రభుత్వాధికారులపై దాడులకు తెగబడటాన్ని మనం చూశామని, రాజకీయాల్లో గెలుపు కోసం బజారు రౌడీలను ప్రధాన పార్టీలు పెంచి పోషిస్తున్నాయని అన్నారు. అందుకే దేశవ్యాప్తంగా కిరాయి హంతకుల ఘాతుకాలు పెరిగిపోతున్నాయన్నారు. పరిపాలనలో దాదాగిరి పెరిగిపోతే ఎలాంటి పరిశ్రమలూ రావని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రహించాలని సురేన్ అన్నారు.

లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, విశాఖ మన్యంలో బాక్సైట్ తవ్వకాలను అనుమతించే జీవోను నిలుపుచేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవటం మంచి పరిణామమన్నారు. గిరిజనుల సమస్యలను తెలుసుకోకుండా తమకు నచ్చినట్టు వ్యవహరిస్తామంటే ప్రజా తిరుగుబాటు తప్పదనే విషయాన్ని చంద్రబాబు గ్రహించాలన్నారు. ప్రభుత్వాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మైనింగ్, అమరావతి వంటి పెద్ద ప్రాజెక్టులను పర్యావరణ, సామాజిక ప్రభావ విశ్లేషణ లేకుండా చేపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడి మద్యం అమ్మకాలకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలతో ప్రజాసంఘాలు గొంతుకలపాల్సి ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ పనిచేయకుండా ప్రకటనలతో కాలం గడుపుతోందన్నారు. మీడియా సమావేశంలో లోక్‌సత్తా పార్టీ జాతీయ క్రమశిక్షణాసంఘం సభ్యులు డా॥ పట్టాభిరామయ్య, రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు నాగేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు నాగార్జున, నగర అధ్యక్షుడు అశోక్, చందూ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విపత్తులపై స్థానిక ప్రభుత్వాలదే కీలకపాత్ర, లోక్‌సత్తా విధానాన్నే ధృవీకరించిన ప్రపంచ కాంగ్రెస్

విపత్తులను తట్టుకునే భవన సముదాయాల్ని, సమాజాన్ని నిర్మించుకోవాలని, ఇందుకు గ్రామ స్థాయి నుంచీ జిల్లా స్థాయి వరకూ స్థానిక ప్రభుత్వాలే కీలక పాత్ర వహించాలని విశాఖపట్నంలో ఇటీవల జరిగిన రెండో ప్రపంచ విపత్తుల కాంగ్రెస్ తీర్మానించింది. విపత్తుల సన్నద్ధత, ప్రణాళికల రూపకల్పన, స్పందన, విపత్తుల నుంచి కోలుకోవటం, నష్టాలను తగ్గించుకోవటంలో స్థానిక ప్రభుత్వాలకు కీలక పాత్ర పోషించాలని, అప్పుడే ప్రజలు భాగస్వాములై చురుగ్గా వ్యవహరించగలుగుతారని ఈ సమావేశం పేర్కొంది. స్థానిక వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ఎక్కువస్థాయి నిధుల్ని కేటాయించాలని విశాఖ డిక్లరేషన్ స్పష్టంచేసింది. ప్రకృతి విపత్తుల నిర్వహణలో వివిధ రాష్ట్రాలు, ఆయా ప్రాంతాలు అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను ఇచ్చిపుచ్చుకునేందుకు ఉమ్మడి వేదిక ఏర్పాటవ్వాలని, అంతరిక్ష, సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సిఫార్సు చేసింది.

కొంతకాలం క్రితం విశాఖపట్నంలో హద్‌హద్ తుపాను వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్కడే మకాం వేసి ప్రజలకు కనీస సౌకర్యాలను పునరుద్ధరించటం పెద్ద విజయంగా చెప్పుకున్నారు. ఆ తర్వాత ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికినప్పుడు కూడా ఆయన తప్పు చేసినందుకు కాకుండా.. హద్‌హద్ సమయంలో తనకు వచ్చిన పేరు పోయిందని తెగ బాధపడిపోయారు. లోక్‌సత్తా తొలినుంచీ చెబుతోంది... "అలాంటివి ముఖ్యమంత్రులు చేయాల్సిన పనులు కావు. ఆ సమయంలో వీఐపీలు అక్కడికి వెళ్లటం వల్ల ప్రజలకు సేవలు ఇంకా ఆలస్యమవుతాయి. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తే అక్కడి నేతలే సమర్థవంతంగా విపత్తును ఎదుర్కొంటారు. తాము చేయాల్సిన పనులు చేయకుండా సర్పంచ్‌లు, మేయర్ చేయాల్సిన పనులు చేస్తూ ముఖ్యమంత్రులు మభ్యపెడుతున్నారు, ఈ అధికార కేంద్రీకరణ ప్రమాదం" అని. తాజాగా ప్రపంచ విపత్తుల కాంగ్రెస్ డిక్లరేషన్ కూడా లోక్‌సత్తా మూడో అంచె పాలనా విధానాన్నే సమర్థించింది.

# హైదరాబాద్‌లో మహిళలకు రక్షణ కరవు

■ లోక్‌సత్తా ఆడిట్ సమావేశంలో మహిళల అభిప్రాయం ■ రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్

హైదరాబాద్ నగరంలో మహిళలకు రక్షణ కరువైందని, దొంగతనాలు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలతో రక్షణ లేకుండా పోతోందని లోక్‌సత్తా సోషల్ ఆడిట్ సమావేశంలో పలువురు మహిళలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో లోక్‌సత్తా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'హైదరాబాద్‌లో మహిళలకు రక్షణ ఉందా' అనే కార్యక్రమంలో పలువురు మహిళలు, నాయకులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో గొలుసు దొంగతనాలు, మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయని, దొంగతనాల్లో చాకచక్యంతోపాటు క్రూరత్వం కూడా పెరిగిపోయిందన్నారు. చైన్ స్నాచింగ్ ఘటనల్లో పలువురు బాధిత మహిళలు గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయని మంగళసూత్రాలతో మహిళలు బయటికి వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఆడపిల్లలతో పాటు మగ పిల్లలకు కూడా తల్లిదండ్రులు జాగ్రత్తలు చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. పోలీసులు ప్రజలతో సఖ్యతగా ఉండాలని, పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని సమావేశంలో పలువురు మహిళలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

అనంతరం గ్రేటర్ లోక్‌సత్తా ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, సహకార్యదర్శి లావణ్య మాట్లాడుతూ ఇన్వెస్టిగేషన్ పోలీస్‌వ్యవస్థ రాజకీయ నాయకుల చేతుల్లో ఉండడం మూలంగానే దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో గత ఆరు నెలల కాలంలో దొంగతనాలతో పాటు గూండాయిజం పెరిగిపోయిందని ఆరోపించారు. గత నెలలో ఒకేరోజు ఒక ముఠా మలక్‌పేట్, ఎల్‌బినగర్ నియోజకవర్గాల్లో నలుగురు మహిళల మెడలో నుండి గొలుసులు అపహరించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ లోక్‌సత్తా అధ్యక్షులు వంశీ, నాయకులు మోహన్‌రావు, శర్మ, శ్రీధర్‌రెడ్డి, బొంతు సాంబిరెడ్డి, జయప్రకాష్, మహిళా నాయకులు సంధ్య, శ్రీవాణి, శ్రీదేవి, లక్ష్మి, సోని, కె. శ్రీదేవి, కైలాష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు, అవినీతి సంగతేమిటి?

హైదరాబాద్ నగరంలో తక్షణావసరంలేని స్కై వేల కోసం రూ. 2100 కోట్లతో టెండర్లను పిలిచి ఆగమేఘాల మీద చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం, 2007 నుంచి 2014 వరకు రూ. 40.88 కోట్లతో ప్రారంభించిన 11 పెండింగ్ ప్రాజెక్టులను గాలికొదిలేశారని, వాటి అవినీతి సంగతేమిటని లోక్‌సత్తా నేతలు ప్రశ్నించారు. కేపీహెచ్‌బీ కాలనీలో 2007 నుంచి పెండింగ్‌లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్, సిమ్మింగ్‌పూల్, స్పోర్ట్స్ ఆడిటోరియంపై సహ చట్టం కింద తీసుకున్న వివరాలను విడుదల చేశారు. 2008 నుంచి ఎన్టీఆర్ స్టేడియంకు ఏటా రూ. 70లక్షల ఆదాయం వస్తుండగా, ఇప్పటివరకూ రూ. 4.7 కోట్ల రూపాయల ఆదాయాన్నే చూపుతున్నారని, ఈ వివరాలను వెల్లడించాలని సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల క్రితం స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో జరిగిన అవినీతిపై వేసిన ఎంక్వయిరీ రిపోర్టును కూడా బైటపెట్టాలన్నారు. 2008 నుంచి రూ. 47.35 కోట్లు ఖర్చు చూపిస్తున్నవారు రూ. 14కోట్లతో కొనుగోలు చేసిన స్పోర్ట్స్ పరికరాల వివరాలు తమ వద్ద లేవని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదాయవ్యయాల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలన్నారు.

# తాగునీటి సమస్యలపై పరిశీలన

ఆల్విన్ కాలనీలో గత కొన్ని నెలలుగా మంచినీరు కలుషితమవుతున్నా నాయకులు పట్టించుకోవటం లేదని లోక్‌సత్తా నాయకులు ఆరోపించారు. కాలనీలో తాగునీటి సమస్యల్ని తెలుసుకునేందుకు పార్టీ నాయకులు హైదర్‌నగర్ డివిజన్‌లో పర్యటించారు. ఇక్కడి ప్రజలు ఏటా రూ. 19లక్షలు నీటి బిల్లులు చెల్లిస్తున్నా సరైన తాగునీరు అందించటంలో అధికారులు, నాయకులు విఫలమయ్యారని బొంతు సాంబిరెడ్డి అన్నారు. మంజీరా పైపులైను శిథిలావస్థకు రావడంతో సమస్య ఏర్పడిందని కాలనీ వాసులు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను తక్షణం పరిష్కరించాలని లోక్‌సత్తా నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జయప్రకాష్, ప్రసాద్, గద్దం సతీష్, కుమార్ రెడ్డి, జుబేర్, అవినాష్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.





భారతదేశంలో ఉదార
విలువలకు కావలసిన
వ్యవస్థీకృత సంస్కరణలపై
ఇటీవల న్యూఢిల్లీలో
ప్రసంగిస్తున్న జేపీ



డబ్బు, మద్యం ప్రలోభాలకు, కుల, మత ఉద్రేకాలకు లోను కాకుండా స్థానిక ఎన్నికల్లో లోక్‌సత్తా
అభ్యర్థులను గెలిపించిన కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామంలో పర్యటించి
స్థానిక సమస్యలకు మెరుగైన పరిష్కారాలను ప్రజలతో చర్చించిన
పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీ వాస్తవ, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ

Posting Date 07-12-2015

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on December 1st 2015

# ఈ అవ్వ గుర్తుందా?



కొత్త రాజకీయానికి నేను సైతం అంటూ యువతీయువకులకు సవాలు విసురుతున్న ఈ అవ్వ గుర్తుందా? 2009లో ప్రకాశం జిల్లా బల్లికురవలో లోక్‌సత్తా పార్టీ ఎన్నికల ప్రచారానికి ఆకర్షితురాలై పార్టీలో చేరిన 100 సంవత్సరాల వృద్ధురాలు ఈమె. మైకులో పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేరు విన్న పావులూరి తిరుపతమ్మ ... ఏందీ మా పాత కలెక్టరా? మందు పూర్తిగా తీసేస్తానన్నాడా? నేనొస్తున్నా ఆగండంటూ ప్రచార వాహనం దగ్గరకొచ్చారు. నా ఓటు మా పాత కలెక్టర్‌కేనంటూ లోక్‌సత్తా పార్టీ టోపీ, కండువా ధరించారు.

| Book-Post<br>PRINTED MATTER | To, |
| --- | --- |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad